ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 10 ఏప్రిల్ 2024 | 5





పవన్‌కు ఉగాది పచ్చడి తినిపిస్తున్న వర్మ



నిడదవోలు మండలం బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు శేషారావు, పెందుర్తి వెంకటేష్ తదితరులు

ఉభయ గోదావరి జిల్లాల్లో చంద్రబాబు, పవన్ రోడ్ షో

- నేడు తణుకు, నిడదవోలులో ఉమ్మడిగా పర్యటన
- రేపు అంబాజీపేట, అమలాపురంలో బహిరంగ సభలు
- అమలాపురం పర్యటనకు విడుదల కాని పవన్ షెడ్యూల్

రాజమహేంద్రవరం/ అమలాపురం/నిడదవోలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం,జనసేన పార్టీల అధినేతలు నారా చంద్ర బాబునాయుడు, పవన్‌కల్యాణ్ రెండు రోజుల పాటు ఉభయగోదావరి జిల్లాల్లో ఉమ్మడిగా రోడ్ షో,బహిరంగ సభలు నిర్వహించనున్నారు.పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో బుధవారం సాయంత్రం 4 గంటలకు రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం చంద్రబాబు, పవన్ రోడ్డు మార్గాన తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మీదుగా నిడదవోలు చేరు కుంటారు. నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లో రాత్రి 7 గంటలకు రోడ్ షో నిర్వహిస్తారు. సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొంటారు. చంద్రబాబు, పవన్ కలిసి తొలిసారి ఉమ్మడిగా జిల్లాలో పర్యటిస్తున్నారు.దీంతో ఈ పర్యటనకు ప్రాధాన్యత పెరిగింది.కూటమి నాయకులు అందరూ హాజరై సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే శేషారావు, జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.ఈ మేరకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ముగిసిన అనంతరం చంద్రబాబు నిడదవోలులోని తిరుమల సాయి కల్యాణ మండపంలో రాత్రి బసచేస్తారు. పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో రాత్రి బసచేస్తారు. 11వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి చంద్రబాబు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా నేతలతో నిడదవోలులో సమీక్ష చేస్తారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో అందరూ కలసి పనిచేయవలసిన అవసరం.. అసం తృప్తులు, కొందరి ఒంటెద్దు పోకడలపై చర్చిస్తారు. ఇప్పటికే జిల్లాలో కొన్ని నియోజక వర్గాల్లో అసంతృప్త నేతలను దారికి తెచ్చారు. నిడదవోలు నియో జకవర్గానికి చెందిన సీనియర్‌నేత కుందుల సత్యనారాయణ, నిడదవోలు పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు గూడపాటి వెంకట్రావు మౌనంగా ఉండడానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీసే అవకాశం ఉంది. రాజానగరం బీజేపీ ఆత్మీయ సమా వేశంలో అక్కడ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ ఫొటో బ్యానర్‌లో పెట్టకపోవడంతో సోమవారం కొందరు టీడీపీ వర్గాలు సమావేశాన్ని బహిష్కరించిన విషయం కూడా ఇక్కడ చర్చకొచ్చే అవకాశం ఉంది. అనపర్తి సీటు టీడీపీకే ఖాయం చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ విషయంలో కూడా ఇక్కడ మళ్లీ స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.మధ్యాహ్నం ఒంటి గంటకు భోజన విరామం తీసుకుంటారు.అనంతరం 2 గంటలకు బయలుదేరి చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.25 గంటలకు అంబాజీపేట హైస్కూలు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగుతారు.జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన ఇంకా షెడ్యూలు విడుదల కాలేదు. ఆయన కూడా ప్రత్యేక హెలికాప్టర్‌లో అంబాజీపేట హైస్కూలు గ్రౌండ్‌లో దిగనున్నారు. చంద్రబాబు హైస్కూలు గ్రౌండ్ నుంచి 3.30 గంటలకు బయలుదేరి 3.45 గంటలకు అంబాజీపేట నాలుగు రోడ్ల జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడ 4 గంటల నుంచి ప్రారంభమయ్యే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొంటారు. గంటన్నర సేపు జరిగే సభ అనంతరం రోడ్డు మార్గాన అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌కు సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంటారు. 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రసంగిస్తారు. 8.45 గంటలకు సభ ముగిసిన తరువాత చంద్రబాబు కిమ్స్ వైద్యకళాశాల గ్రౌండ్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారని టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కందుల దుర్గేష్, తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కమిటీ చైర్మన్ పెందుర్తి వెంకటేష్ నిడదవోలు పట్టణంలో హెలిపాడ్ ప్రాంతం, బహిరంగ సభ జరిగే ప్రాంతం, రాత్రి చంద్రబాబునాయుడు బసచేసే ప్రాంతాలను పరిశీలించారు.



కాంగ్రెస్ ప్రచార వాహనాలు ప్రారంభిస్తున్న ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు

కాంగ్రెస్‌లోనే రాష్ట్రాభివృద్ధి

- రాజమండ్రిలో కాంగ్రెస్ కార్యాలయం ఏర్పాటు
- ప్రారంభించిన ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9: రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీయేనని రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరం పాతసోమాలమ్మ ఆలయం రోడ్డులో ఒక భవనంలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పభుత్వంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. మధురపూడి ఎయిర్‌పోర్టుగాని, నన్నయ్య యూనివర్శిటీ, గామన్ బ్రిడ్జి నిర్మాణం, నగరంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు, ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలను ప్రారంభించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఎస్ఎన్ రాజా, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, అనపర్తి అభ్యర్థి యల్లా శ్రీనివాస్, రాజానగరం అభ్యర్థి ఎం.శ్రీనివాసరావు, కొవ్వూరు అభ్యర్థి అరిగెల అరుణకుమారి, డాక్టర్ వడయార్, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం కాంగ్రెస్ అభ్యర్థిగా చోడదాసి

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. ఇప్పటి వరకూ గోపాలపురం మినహా మిగిలిన ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అయితే గోపాలపురం నియోజకవర్గానికి మంగళవారం చోడదాసి మార్టిన లూథర్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను బరిలోకి దింపినట్టయింది. అయితే కొవ్వూరు, అనపర్తి అభ్యర్థులను మార్చాలని స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కొవ్వూరు అభ్యర్థిని మార్పు చేసి.. స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలని గత రెండు రోజులుగా కొవ్వూరులో నాయకులు నిరాహారదీక్ష చేస్తున్నారు.

పవన్‌తో రఘురామరాజు భేటీ

పవన్ కేరాఫ్ పిఠాపురం!





పంచాంగాలు ఆవిష్కరిస్తున్న పవన్



కొత్త ఇంటి వద్ద పవన్‌కు మహిళల హారతి

- ఇక్కడి నుంచే కూటమి విజయ ప్రస్థానం
- రాబోయే ఎన్నికల్లో కూటమిదే ప్రభుత్వం
- చేబ్రోలులో పవన్ గృహ ప్రవేశం
- నివాసం, జనసేన కార్యాలయం ఇక్కడే
- ఉగాది వేడుకల్లో జనసేనాని.. పచ్చడి తినిపించిన వర్మ
- వేదపండితులకు సత్కారం
- హైదరాబాద్‌కు పయనం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి),పిఠాపురం,గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 9 : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పుర్హూతిక అమ్మవారి దయ, శ్రీపాదశ్రీవల్లభుడు, బంగారుపాపమ్మ ఆశీస్సులు, దీవెనలతో పిఠాపురం నుంచే విజయకేతనం ఎగురవేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అందరి మద్దతుతో కూటమి ప్రభుత్వం ఇక్కడి నుంచే విజయప్రస్థానం సాగిస్తుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. చేబ్రోలులో హైవేను ఆనుకుని ఉన్న ఇంట్లో పవన్ నూతన గృహ ప్రవేశం చేసి మాట్లాడారు. ఈ ఇంటి యజమాని ఓదూరి నాగేశ్వరరావు దంపతులు, వారి పిల్లలు రెండేళ్ల కిందట మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చారని గుర్తు చేశారు. అప్పుడు వీరంతా తనను పిఠాపురం నుంచి పోటీ చేయాలని కోరారని, కానీ అప్పుడు తాను అంతగా ఆలోచించలేదన్నారు. ఒక నియోజకవర్గం నుంచి తనను పోటీ చేయాలని ఇంత మంది కోరుకుంటారని అనుకోలేదన్నారు. ఆ రోజున పిఠాపురం ప్రజల గొంతుని, ఆకాంక్షని ఆ తల్లి(పుర్హూతికాఅమ్మవారు) ఓదూరి దంపతుల ద్వారా నా దృష్టికి తీసుకువచ్చిందని ఇప్పుడు భావిస్తున్నానన్నారు.శ్రీక్రోధి నామసంవత్సరంలో రాష్ట్రంలో మార్పునకు పిఠాపురం నుంచే శ్రీకారం చుడదామని పిలుపునిచ్చారు.చేబ్రోలులో ఉన్న గృహమే ఇకపై తన నివాసమని, ఇక్కడే జనసేన కార్యాలయం ఉంటుం దని ప్రకటించారు.ఈ ఏడాది అంతా క్షేమంగా ఉండాలని ఆకాం క్షించారు.తన కోసం నియోజకవర్గంలో పనిచేస్తున్న టీడీ పీ,జనసేన,బీజేపీ నాయకులకు అభినందనలు చెప్పారు. కొత్త ఇంటిలో మాజీ ఎమ్మెల్యే వర్మ, ఎంపీ అభ్యర్థి ఉద య శ్రీనివాస్, బీజేపీ నేత కృష్ణంరాజులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎన్నికలకు సమయం దగ్గరపడడంతో ప్రచారాన్ని పెంచే అంశంపై చర్చించారు.అనంతరం నియోజకవర్గానికి చెందిన జనసేన నేతలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఆ తర్వాత నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు పవన్‌తో భేటీ అయ్యారు.రఘురామ పోటీచేసే స్థా నం ఏంటనే దానిపై ఇరువురు చర్చించుకున్నారు. సమావేశాలు ముగించుకుని మధ్యాహ్న భోజనం అనంతరం మధ్యా హ్నం 3.18 గంటలకు గొల్లప్రోలు హెలిప్యాడ్ నుంచి పవన్ హైదరాబాద్ బయలుదేరారు.కార్యక్రమాల్లో జనసేన పార్టీ ప్రదాన కార్యదర్శి నాగేంద్రబాబు, ఉపా ధ్యక్షుడు బి.మహేందరరెడ్డి,నేతలు వేములపాటి అజయకుమార్,మర్రెడ్డి శ్రీనివాస్, కల్యాణం శివ శ్రీనివాస్,ఎన్.శంకరగౌడ్, యాతం నగేష్,పీవీ రత్నం, బన్నీ వాసు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో పవన్ గృహ ప్రవేశం

పవన్ చేబ్రోలులో తీసుకున్న ఇంట్లో మంగళవారం గృహ ప్రవేశం చేశారు. హైదరాబాదు నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరిన పవన్ మంగళవారం ఉదయం 10.07 గంటలకు గొల్లప్రోలు హెలిప్యాడ్‌కు చేరుకుని రోడ్డు మార్గాన చేబ్రోలు బైపాస్‌రోడ్డులో నివాసానికి చేరుకున్నారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీసి పవన్‌ను ఆహ్వానించారు. గృహప్రవేశం అనంతరం ఇంట్లో పవన్ పూజలు చేశారు. ఇంట్లో మూడు అంతస్తులను తిరిగి చూసి అదే ఆవరణలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు,కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లతో కలిసి పాల్గొన్నారు. వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. పవన్‌కల్యాణ్‌కు వేద ఆశీర్వచనాలు పలికి సత్కరించారు. అనంతరం వేదపండితులను పవన్ సత్కరించి పంచాంగాలు అందజేశారు.పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తన సతీమణి లక్ష్మీదేవితో కలిసి ఉగాది పచ్చడిని పవన్‌కు తినిపించారు.అనంతరం వెండి గ్లాసుల సెట్, ఉగాది పచ్చడిని ప్రత్యేక డబ్బాలో ఉంచి వర్మ పవన్‌కు అందించారు.వెంకటేశ్వరస్వామి ఫొటోను అందించారు. బీజేపీ ఇన్‌చార్జి బుర్రా కృష్ణంరాజు దంపతులతో ఫొటో దిగారు. ఉగాది వేడుకలకు కూటమి నాయకులు, వివిధ వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చారు.మల్లాం, ఎఫ్‌కేపాలెం మాజీ సర్పంచ్‌లు కుంపట్ల చెల్లారావు, జవ్వాది జోగేశ్వరరావు ధాన్యం కుచ్చులను పవన్‌కు అం దజేశారు.పట్టణానికి చెందిన కవి గౌరినాయు డు తాను రచించిన పుస్తకాలు, అవంత్స సోమసుందర్ రచనలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.భానుప్రసాద్ చెక్కతో తయారు చేయించిన ఎడ్లబండి,అందులో రైతు, జనసేన జండాలతో కూడిన జ్ఞాపిక తెచ్చారు.



తమ్ముడి వెంట : ఉగాది వేడుకలకు హాజరైన నాగబాబు తదితరులు



తరగని అభిమానం : చేబ్రోలులో పవన్ నివాసం వద్ద అభిమానుల కోలాహలం



పవనాభిమానం : పవన్‌కు జ్ఞాపిక.. పవన్‌తో ఫొటో

గుండెల నిండా పవన్



రాజమండ్రి శ్యామలాంబ



కొవ్వూరు కొవ్వూరమ్మ



నిడదవోలు కోటసత్తెమ్మ



నా మాట విను స్వామి : బిక్కవోలు లక్ష్మీగణపతికి చెవిలో చెప్పేందుకు పోటీపడుతున్న భక్తజనం

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

గుండెపోటుతో సెంట్రల్ జైలు ఖైదీ మృతి

7

పూజారినని నమ్మించి బంగారం దోచేశాడు..

కరప విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఘటన

ఉత్సాహంగా తెలుగు సంవత్సరాది

ఇంటింటా శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ

నిడదవోలు/రాజమహేంద్రవరంకల్చరల్/కొవ్వూరు/బిక్కవోలు, ఏప్రిల్ 9 : తెలుగు సంవత్సరాది ఉగాదిని మంగళవారం ఇంటింటా ఆనందంగా జరుపుకున్నారు..షడ్రుచులు తీపి,పులుపు,వగరు, కారం, ఉప్పు, చేదుతో తయారుచేసిన ఉగాది పచ్చడిని సేవించి ఈ ఏడాది అంతా మంచే జరగాలని వేడుకున్నారు. బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగ సందడి కనిపించింది..ఈ ఏడాది తెలుగువారంతా శ్రీ క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఊరూరా గ్రామదేవతల ఆల యాలు కిటకిటలాడాయి. భక్తులు బంధుమిత్రులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో మంగళవారం ఉగాది పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి విశేషపూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పంచాంగ శ్రవ ణం చేశారు. ప్రత్యేక బంగారు నగల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాజమహేంద్రవరం శ్యామలానగర్‌లోని పాత సోమాలమ్మ ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి సోమాలమ్మను దర్శించుకున్నారు. ఎంపీ భరత్‌రామ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కొవ్వూరు మెయిన్‌రోడ్, గోదావరి గట్టుపై కొలువైన గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గరగనృత్యాలు ఏర్పాటుచేశారు. రెల్లిపేటలో కనకదుర్గ, నూకాలమ్మ, పుంతలో ముసలమ్మ, గోష్పాదక్షేత్రంలోని బాలా త్రిపుర సుందరి, సంస్కృత పాఠశాల లలితాపార్వతీ అమ్మవారి ఆలయాలను అలంకరించి విశేష పూజలు చేశారు. బిక్కవోలులోని లక్ష్మీగణపతి దర్శనానికి ఆలయం ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. స్వామి చెవిలో కోర్కెలు చెప్పడానికి భక్తులు పోటీపడ్డారు. గ్రామంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం కూడ భక్తులతో పోటెత్తింది. స్వామికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కుజ, రజ, సర్ప దోష నివారణార్థం అభిషేకాలు చేయించుకున్నారు.వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని బారులు తీరి అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆలయాలన్నీ మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలన్నీ పువ్వులతో మిరు మిట్లు గొలిపే విధంగా అందంగా అలంకరించా రు.ఎండ వేడిమి కారణంగా అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.చల్లనిమజ్జిగ, మంచినీళ్లను అందించారు.భక్తులకు ఉగాది పచ్చడి,ప్రసాద వితరణ చేశారు.వేద పండితులు శ్రీ క్రోధినామ సంవత్స రంలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించారు. ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బిక్కవోలు లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనాలకు వచ్చిన ఐదు వేల మందికి అన్నదాన ఏర్పాట్లు చేశారు.



పంచాంగకర్త పుల్లెల సత్యనారాయణకు సత్కారం చేస్తున్న పురందేశ్వరి, కాతేరు శ్యామలాంబకు పూజలు



అందరికీ మంచి జరగాలి : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9 : శ్రీ క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు అందరికీ మంచి జరగాలి, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, బీజేపీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పురందేశ్వరి రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రముఖ పంచాంగకర్త పుల్లెల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. వివిధ రంగాల ప్రముఖులను పురందేశ్వరి సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, బీజేపీ నాయకులు దత్తు, పరిమి రాధాకృష్ణ, రేలంగి శ్రీదేవి, కురగంటి సతీష్, రొంగల గోపి, యానాపు ఏసు, వీరా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామిని పురందేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంగిన నారాయణరావు ఆధ్వర్యంలో కాతేరు శ్యామలాంబ ఆలయాన్ని దర్శించి అమ్మవారికి పూజలు చేశారు.



నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణం



బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయం వద్ద భక్తుల క్యూ



వేద పండితుడిని సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఆరుగురు వేదపండితులకు కలెక్టర్ ఉగాది సత్కారం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 9 : కలెక్టర్ విడిది కార్యాలయంలో మంగళవారం ఉదయం శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది 2024 పురస్కార వేడుకలను పురస్కరించుకుని వేద,ఆగమన పండితులను జిల్లా కలెక్టర్ మాధవీలత సత్కరించారు.వేద, ఆగమన పండితులు అప్పలి నరసింహారావు (విజ్జేశ్వరం), అగ్నిహోత్రం వెంకట సీతారామానుజాచార్యులు (గోపా లపురం), చెరుకూరి భీమశంకరం (రాజమండ్రి), రుద్రపాక శేషగిరిరావు(అన్నదేవర పేట), పొన్నూరి అనంత సత్య వల్లభాచార్యులు (ధవళేశ్వరం), పూజ్యం శంభు ప్రసాద్ (వడిశలేరు)లకు నగదు పురస్కారం, మెమెంటో అందజేసి,శాలువాతో సత్కరించారు.ఈ సం దర్భంగా వేదపండితులు ఆశీర్వనాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా దేవదయ ధర్మదాయ శాఖ అధికారి వి.సోమరాజు,వివిధ ఆలయాల ఈవోలు, ఎండోమెంట్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు

● శ్రీసిద్ధివినాయక ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శ్రీసిద్ధివినాయకుడు, లక్ష్మీగణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అయినవిల్లి, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. తొలి పూజలు అందుకునే దైవం, విఘ్నాలు నివారించే విఘ్నేశ్వరుని నూతన తెలుగు సంవత్సరం సందర్భంగా స్వామిని దర్శించుకుంటే విఘ్నాలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దాంతో అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో అయినవిల్లి ఆలయం కిక్కిరిసింది. రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముక్తేశ్వరం నుంచి అయినవిల్లి వరకు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. క్యూలైన్లు, ఆలయ మండపం భక్తులతో కిక్కిరిశాయి. దర్శనానికి గంటల కొద్దీ భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం సిబ్బంది సేవలు అందించారు. భక్తుల రద్దీ దృష్ట్యా అన్నసమారాధనకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

ఆదాయం 2.. వ్యయం 14

● శ్రీ క్రోధి నామసంవత్సరంలో ఇదీ సత్యదేవుడి లెక్క
● అన్నవరంలో వేదపండితుల పంచాంగ శ్రవణం
● పండితులకు సత్కారం ● వెండి రథంపై ఊరేగింపు



ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న పండితులు



పండితులను సత్కరిస్తున్న ఈవో, చైర్మన్‌లు

అన్నవరం, ఏప్రిల్ 9: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం క్రోధి నామసంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడు మ అనివేటి మండపం వద్దకు తోడ్కొని వచ్చి ప్రత్యేకవేదికపై ఆశీనులు గావించారు. ప్రత్యేకపూజలు అనంతరం దేవస్థానం వేదపండితులు గొల్లపల్లి వెంకట సుబ్రహ్మణ్య ఘనాపాఠి పంచాంగ శ్రవణం పఠించారు. మఖ నక్షత్రం, సింహరాశి కలిగిన సత్యదేవుడికి ఈఏడాది ఆదాయం 2, వ్యయం 14 ఉందని దీనిద్వారా భక్తులకు క్రోధి నామసంవత్సరంలో భక్తుల సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. ఈఏడాది అన్నివర్గాల ప్రజలకు అనుకూలత లభిస్తుందన్నారు. అనంతరం ఉగాది పచ్చడిని స్వామివారికి నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐదుగురు పండితులను ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు ఘనంగా సత్కరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 10గంటలకు వెండిరథంపై స్వామి,అమ్మవార్లను తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు పండితుల వేదమంత్రోచ్చరణలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు. రాత్రి 7గంటలకు వెండిగజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం ముద్రించిన పంచాంగంను ఉచితంగా పంపిణీ చేశారు. సత్యదేవుడి సన్నిధిలో ఏర్పాటుచేసిన పుష్పాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది. పలువురు భక్తులు వీటివద్ద స్వీయచిత్రాలు దిగడం విశేషం. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన గర్భాలయంలో
తలుపులమ్మ దర్శనం

● వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ తల్లి

తునిరూరల్, ఏప్రిల్ 9: తలుపులమ్మ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. 15నెలలుగా ఆలయం పునఃనిర్మాణంలో భాగంగా దిగువ బాలాలయంలో భక్తులను అనుగ్రహిస్తున్న తలుపులమ్మ అమ్మవారు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఇప్పటికే పూర్తయిన ప్రధాన గర్భాలయంలో భక్తులకు దర్శనమిచ్చే విధంగా ఏర్పాట్లు చేయడతో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చిన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి రామచంద్రమోహన్ దంపతులు హాజరై అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం చేపట్టి అనంతరం ఆలయ అర్చకులకు ఉగాధి పురస్కారాలతో పాటుగా ముఖ్య అర్చకులకు రూ.10,116 లు, ప్రసంశాపత్రాలు అన్నవరం కార్యనిర్వహణాధికారి కె.రామచంద్రమోహన్ అందజేశారు.



పంచాంగ శ్రవణం పరిస్తున్న అర్చకులు

చంద్రబాబు, పవన్ సభ విజయవంతం చేయాలి

● రేపు అంబాజీపేట, అమలాపురంలలో బహిరంగ సభలు
● పర్యటనపై సమీక్షించిన నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు

అంబాజీపేట, ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ సభను కూటమి శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, మాజీ మంత్రి, జనసేన నాయకుడు కొత్తపల్లి సుబ్బారాయుడు కోరారు. అంబాజీపేటలోని వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమన్వయ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, నిమ్మల రామానాయుడు, కొత్తపల్లి సుబ్బరాయుడులు మాట్లాడుతూ అధినేతలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు నిర్వహించే బహిరంగ సభకు నియోజకవర్గంలోని కూటమి పార్టీ శ్రేణులంతా అధిక సంఖ్యలో తరలివచ్చేలా కృషిచేయాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన అరాచకాలపై ప్రజలు విసుగెత్తి ఉన్నారని ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఉమ్మడిపార్టీలు ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించాలన్నారు. నియోజకవర్గంలోని 68 గ్రామాల్లోని జనసమీకరణ చేసి భారీగా మోటార్‌సైకిళ్లతో ర్యాలీగా సభస్థలానికి చేరుకోవాలన్నారు. తొలుత అంబాజీపేట హైస్కూల్‌లో ఏర్పాటుచేసే హెలిప్యాడ్‌లను టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పరిశీలించారు. అధినేతలు హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌లో దిగి అక్కడ నుండి అంబాజీపేట- అమలాపురం ప్రధాన రహదారిలో ఆంధ్రాబ్యాంక్ సమీపంలో ఏర్పాటుచేసే బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఈ సభను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అమలాపురంల లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గ కోకన్వీనర్ నామన రాంబాబు, నాయకులు డొక్కా నాథ్‌బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, యర్రా వేణుగోపాలరాయుడు, షేక్ సుభాన్, చీకరుమల్లి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, గణపతి వీరరాఘవులు, దాసరి వీరవెంకట సత్యనారాయణ, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం బాలవిజయరావు పెదపూడి శ్రీనివాసరావు, చిట్టూరి శ్రీనివాస్, సుదా బాబ్జి, తోలేటి సత్తిబాబు, మద్దాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



భీమేశ్వరాలయంలో ఉగాది పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉగాది ప్రత్యేక పూజలు

● భక్తులతో ఆలయాలు కిటకిట

సామర్లకోట, ఏప్రిల్ 9: క్రోధి నామసంవత్సరం, ఉగాది, కొత్తసంవత్సరం మహాపర్వదినం సందర్భంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయం, పురాతన ప్రసిద్ధి పొందిన మాండవ్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భీమేశ్వరాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీనివాసరావు, అంజిబాబు తదితరులచే ముందుగా భీమేశ్వరస్వామికి అభిషేకపూజలు నిర్వహించారు. అనంతరం నంది మండపంవద్ద ఈవో నీలకం ఠం తదితర భక్తుల నడుమ ఉగాది పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం సీతారామచంద్ర స్వామి ఆలయ పండితులు బృందావనం వెంకట రమణమూర్తిచే పంచాంగ శ్రవణం నిర్వహించి ఆయా రాశుల వారికి పంచాంగ ఫలాలను వివరించారు. ఆలయ ఈవో నీలకంఠం పండితులు వెంకటరమణ మూర్తికి పండిత సత్కారం నిర్వహించారు. భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ దంపతులచే భక్తులకు పంచాంగ ప్రతులను అందజేశారు. ఈవో ఉగాది పచ్చడిని పలువురికి అందజేశారు. ఈ పూజలలో జనసేన నాయకులు బిక్కిన రాజశేఖర్ దంప తులు తదితర ఆలయ సిబ్బంది, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో 600 మంది భక్తులకు, భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయం వెలుపల సుమారు 500 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా వసంత నవరాత్రి ఉత్సవాలు

వసంతనవరాత్ర మహోత్సవాలు పురష్కరించుకుని సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి వసంత నవరాత్ర మహోత్స వాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు నంది మండపంవద్ద విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, కలశస్థాపన పూజలు నిర్వహించారు. బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ దంపతులు, బిక్కిన రాజశేఖర్ దంపతులు ఆశీనులయ్యి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశేష కుంకుమార్చన పూజలలో కూరగాయల గొల్లబాబు అనిత దంపతులు, కుసుమంచి శేషగిరిరావుపావని దంపతులు, కుసుమంచి శ్యామ్ కుమార్‌హారిక దంపతులు ఆశీనులయ్యారు. పూజల అనంతరం ప్రసాదవితరణ నిర్వహించారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు

● సింహ వాహనంపై విహరించిన శ్రీవారు



సింహ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 9:వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి అధ్యయనోత్సవాలు మంగళవారం ముగిశాయి. చతుర్వేద పారాయణం, ద్రవిడ వేద పారాయణంలను వేద పండితులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా కాల్పుల నడుమ గరుడ, సింహ, హంస వాహనాలపై స్వామివారు తీరు వీధుల్లో విహరించారు. చంగోలం పారాయణం, పరమపదోత్సవం, నీరాజన మంత్రపుష్పంలతో అధ్యయనోత్సవాలకు ముగింపు పలికారు. ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి చెందాడు. జైలు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.వెంకటేశ్వరరావు(80) పోక్సో కేసులో 20 ఏళ్ల శిక్షపడి గతేడాది అక్టోబరు 10న విజయవాడ జైలు నుంచి ఇక్కడికి వచ్చాడు. వయసు రిత్యా రుగ్మతలవల్ల ఊపిరితిత్తుల సమస్యలతో బాధ పడుతుండగా పలుమార్లు వైద్యం అందించారు. శ్వాస తీసుకో వ డంలో ఇబ్బంది ఏర్పడడంతో గతనెల 27నుంచి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేస్తున్నారు. గుండెపోటు రావడంతో సోమవారం మృతి చెందాడని జైలు అధికారులు పేర్కొన్నారు.

పూజారినని.. దోచుకున్నాడు..!

● కరపలో అమ్మవారి ఆభరణాలతో పరార్



సీసీ పుటేజ్ ద్వారా గుర్తించిన దొంగ పూజారి చిత్రం

వాకాడ (కరప), ఏప్రిల్ 9: పూజారినని నమ్మించి అందినకాడికి దోచుకున్న ఘరానా మోసగాడి ఉదంతం కాకినాడ జిల్లా కరప మండలం వాకాడ గ్రామంలో జరిగింది. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బాబాజీశర్మ అనే వ్యక్తి గత ఏడాదిన్నర నుంచి పూజారిగా పనిచేస్తున్నాడు. పశ్చిగోదావరిజిల్లా పసలపూడి గ్రామానికి చెందిన బాబాజీశర్మ పూజారి విధుల నుంచి తప్పుకోవడంతో గ్రామపెద్దలు మరో పూజారి కోసం బ్రాహ్మణ సంఘం పెద్దలను సంప్రదించారు. ఇదిలా వుండగా కృష్ణచైతన్య అనే వ్యక్తి మార్చి 28న గుడికి వచ్చి పూజారిగా విధులు నిర్వహిస్తానని నమ్మబలికి రూ.5వేలు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఏప్రిల్ 1వ తేదీ తెల్లవారుజామున గుడికి వచ్చి సంప్రోక్షణ, స్వామి అమ్మవార్లకు పూజాధికాలు నిర్వహించి దూపదీప నైవేద్యం సమర్పించాడు. పాత పూజారి సమక్షంలో గర్భగుడిలోని అమ్మవారి బంగారు ఆభరణాలు ఉండే లాకర్‌ను తెరిచి రికార్డు ప్రకారం అన్నీ సరిచూసుకున్నాడు. తాను కాకినాడ గాంధీనగర్‌లో ఉంటున్నానని, ఇక్కడకు వచ్చేస్తానని, గ్రామంలో పూజారి కోసం ఎప్పుడూ కేటాయించే ఇంటిని శుభ్రంచేయాలని పెద్దలకు సూచించాడు. ఈ ఇంట్లోకి అవసరమైన సామాన్లు కొనుగోలు చేసుకోవడానికి రూ.20వేలు నగదు, ఒక స్కూటీని తీసుకుని అదేరోజు వెళ్లిపోయి నాలుగు రోజులైనా తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన గ్రామస్థులకు సదరు వ్యక్తి సెల్‌కు ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కంగారుపడిన ఆలయకమిటీ పెద్దలు లాకర్ తెరిపించి చూడగా అమ్మవారికి చెందిన 28గ్రాముల వివిధ ఆభరణాలు కనిపించలేదు. దీంతో మోసపోయామని గుర్తించిన గ్రామస్థులు నిందితుడి ఆచూకీ కోసం గాలించారు. ఈ ఘరానా మోసగాడు కరపలోని ఒక ఫర్నీచర్ షాపు వద్దకు వెళ్లి వాకాడ శివాలయం పూజారిగా పరిచయం చేసుకుని రూ.5వేలు విలువచేసే గ్యాస్ స్టౌ, కుక్కర్, తదితర సామాన్లు కొనుగోలుచేసి మళ్లీ వచ్చి డబ్బులిస్తానని వెళ్లిపోయాడు. అయితే ఆ డబ్బుల కోసమని వాకాడ గుడికి వచ్చిన ఫర్నీచర్ షాపు యజమాని జరిగిన విషయం తెలుసుకుని షాపు వద్ద ఉన్న సీసీ టీవీ ఫుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించారు. ఆలయకమిటీ సభ్యులు అడబాల సూర్యప్రకాశరావు, వెలుగుబంట్ల వీరవెంకటసత్యనారాయణ, గ్రామదేవత ముసాలమ్మతల్లి గుడి కమిటీ చైర్మన్ అడబాల బుచ్చిబాబులు మంగళవారం కరప పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసి నిందితుడి ఫొటోలను అందజేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్సీలో ఉగాది ఆహ్వాన
నాటిక పోటీలు ప్రారంభం



'ఆస్తికలు' నాటికలోని ఒక సన్నివేశం

రావులపాలెం, ఏప్రిల్ 9: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ కాటన్ కళా పరిషత్ వేదికపై 24వ ఉగాది ఆహ్వాన నాటిక పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వీటిని ప్రముఖ సినీ డైరెక్టర్ వంశీ, సీఆర్సీ రూపశిల్పి విక్టరీ వెంకటరెడ్డి, అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి ప్రారంభించారు. రాత్రి ఏడు గంటలకు గంగోత్రి పేదకాకాని వారి 'అస్తికలు' నాటికను ప్రదర్శించారు. దీనికి నాయుడు గోపి దర్శకత్వం వహించగా.. రచన పిన్నమనేని మృత్యుంజయరావు, సంగీతం రమణ, మేకప్ పి.రమేష్, రంగాలంకరణ ఎల్.అనిల్‌కుమార్. కళాకారుల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. రాత్రి 8 గంటలకు పండు క్రియేషన్స్ ఒంగోలు వారి 'పక్కింటి మొగుడు' హాస్య నాటికను ప్రదర్శించారు. బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించగా... రచన గోవిందరాజుల నాగేశ్వరరావు, సంగీతం రమణ, రంగాలంకరణ, ఆహార్యం పాటిబండ్ల కమలాకర్. కళాకారులు అభిమానులను కడుపుబ్బా నవ్వించారు.

పరిణితి చెందిన కొబ్బరికాయల కొనుగోలుకు
కేంద్రం గ్రీన్‌సిగ్నల్


● క్వింటా రూ.3,013 వంతున నాఫెడ్ ద్వారా కొనుగోలు

అంబాజీపేట, ఏప్రిల్ 9: కొబ్బరి రైతులను ఆదుకునేందుకు పరిణితి చెందిన కొబ్బరి కాయలను కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రైతులవద్ద పరిణితి చెందిన కొబ్బరి (ముక్కుడు) కాయలు, పిలకకాయలకు, బోడకాయలకు రూ.3,013 వంతున కొనుగోలు చేసేందుకు మద్దతు ధర ప్రకటించింది. దీనికి సంబంధించి గత నెలలో భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ కార్యదర్శి అజిత్‌కుమార్‌సింగ్ జీవో జారీ చేసినట్లు సమాచారం. ఈ కొనుగోలు బాధ్యతను నాఫెడ్, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌లకు అప్పగించింది. వీటి ద్వారా రైతులవద్ద నేరుగా వలిచిన కొబ్బరికాయలను క్వింటాళ్లు వంతున కొనుగోలు చేస్తారు. వీటిని అనంతరం ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ కంపెనీ (ఎఫ్‌పీవో)లకు విక్రయించి వాటి ద్వారా కోప్రా తయారు చేయించుకుని వారి నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. దీని ద్వారా కొబ్బరి రైతులకు కొంతమేర ఉపశమనం పొందవచ్చు. రైతుల వద్ద నిల్వఉన్న కాయలను కొనుగోలు చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

వివాహిత అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద మృతిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమూరుకు చెందిన ఆశపు నాగజ్యోతి(33)కి నగరంలోని శ్రీరాంనగర్‌కి చెందిన ప్రభుసాగర్‌కి 2016లో వివాహం జరిగింది. జ్యోతి సోమవారం రాత్రి నిద్రించి మంగళవారం ఉదయం మేల్కోలేదని ఆమె తల్లిదండ్రులకు ప్రభుసాగర్ ఫోన్ చేశాడు. దీంతో హుటాహుటిన వచ్చిన తల్లిదండ్రులు కుమార్తె మృతదేహం చూడగా మెడపై కమిలిన చారలు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలం వద్దకు పోలీసులు చేరుకుని ప్రభుసాగర్‌ని ప్రశ్నించారు. సోమవారం ఆమెతో గొడవ జరగడంతో ఉరి వేసుకుందని ప్రభుసాగర్ చెప్పినట్టు తెలుస్తోంది. తన కూతురిని గత కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, ఆ గొడవల నేపథ్యంలో ఆమె హత్యకు గురై ఉంటుందని తండ్రి వెంకటేశ్వర రావు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్నవీరయ్య గౌడ్ పేర్కొన్నారు.

కుమ్మరి శాలివాహన కార్పొరేషన్
రాష్ట్ర డైరెక్టర్ పదవికి భద్రయ్య రాజీనామా



పసలపూడి భద్రయ్య

పెరవలి, ఏప్రిల్ 9: వైసీపీ నాయకుడు, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, కుమ్మరి శాలివాహన సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు తూర్పుగోదావరి జిల్లా పెరవలికి చెందిన పసలపూడి భద్రయ్య రాష్ట్ర డైరెక్టర్ పదవికి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. ఈ నెల 10న నిడదవోలులో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరనున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒరిగిందేమి లేదని, ముఖ్యంగా బీసీలకు చేసిం దేమి లేదని విమర్శించారు. గతంలో తాను టీడీపీలో చాలాకాలం ఉన్నానని, ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే శక్తి చంద్రబాబుకు మాత్రమే ఉందని, అందువల్ల తాను సొంతగూటికి చేరుతున్నట్టు ప్రకటించారు.

దుళ్లలో ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు

● మురమండ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి



మురమండ-దుళ్ళ నందీశ్వర ఆలయం వద్ద ఎడ్ల పోటీల్లో ప్రథమ బహుమతి విజేతకు మెమెంటో, నగదు

కడియం, ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా కడియం మండలం మురమండ-దుళ్ల రోడ్డులోని నందీశ్వర ఆలయం వద్ద ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు మంగళవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 16 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 200 కిలోల బరువుతో 110 గజాల దూరం పట్టు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మురమండ గ్రామానికి చెందిన మిద్దే సురేష్ ఎడ్లు ప్రథమ స్థానాన్ని, రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చెందిన ముంగర నాగేశ్వరరావు ఎడ్లు ద్వితీయ స్థానం, గోకవరం మండలం ముల్లేరు మల్లవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీను ఎడ్లు తృతీయ స్థానం, మురమండకు చెందిన కురసాల లలితేష్ ఎడ్లు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలతోపాటు నగదు బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ జట్టుకు కన్సోలేషన్ బహుమతిగా జ్ఞాపికలు అందించారు. న్యాయనిర్ణేతలుగా మురమండకు చెందిన మొగలపు వెంకటరామకృష్ణారావు, వై.రమేష్‌లు వ్యవహరించారు. మొగలపు హరిశ్చంద్ర ప్రసాద్, వట్టికూటి జానకీరామ్, కొరపాటి చిన్నా, ముత్యాల సత్యనారాయణ ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో చందుకు కాంస్య పతకం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 9: కర్నాటకలోని దేవగిరిలో జరిగిన 27వ జూనియర్ నేషనల్ సపక్‌తక్రా చాంపియన్‌షిప్-2024 పోటీల్లో అమలాపురం పట్టణానికి చెందిన మంచాల చందు ప్రతిభ చాటి కాంస్య పతకాన్ని దక్కించుకున్నట్టు కోచ్‌లు యాండ్ర గౌతమ్, కేతా సతీష్ తెలిపారు. చందును అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సైదులు రమణ, జీవీ బాబు, ఫిజికల్ డైరెక్టర్లు కేఎస్ ప్రసాద్, బూల చిరంజీవి, పేరూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కాంస్య పతకం సాధించిన చందును అభినందిస్తున్న దృశ్యం

కోడిపందాల స్థావరంపై దాడి

రంగంపేట, ఏప్రిల్ 9: మండలంలోని వడిశలేరు గ్రామ శివారులో మంగళవారం కోడి పందాల స్థావరంపై తన సిబ్బందితో కలిసి దాడి చేసినట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రెండు కోళ్లు, రెండు కోడికత్తులు, రూ.2290 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఏజెన్సీ సమాచారం

వైభవంగా ఉగాది వేడుకలు



రంపచోడవరం, ఏప్రిల్ 9: మండలంలోని ఐ.పోలవరం గ్రామంలో ఉన్న గోవింద గిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో క్రోధినామ ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. ధర్మప్రచార సేవా భక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి మాట్లాడుతూ దాతలు సమర్పించిన విరాళాలతో స్వామి వారికి పుష్పాలంకరణ, వస్త్ర సమర్పణ, అన్న ప్రసాద వితరణ చేపట్టినట్లు తెలిపారు. ఆలయ అధికారులు నారాయణరాజు, శివరామ్, అర్చకు లు శ్రీమణికంఠ, పార్థ శ్రీనివాస్, వేదపండితులు సాయిరాం శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

దేవీపట్నం: మండలంలో ఇందు కూరు, ఇందుకూరుపేట, శరభవరం, దేవారం, ఆర్అండ్ఆం కాలనీల్లో ఉ గాది పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజా మునే ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

ఘనంగా గ్రామ దేవతల పండుగ

మండలంలోని గ్రామాల్లో ఉగాది పురస్కరించుకుని గ్రామదేవతల పండుగలు ఘనంగా నిర్వహించారు. ఏనుగులగూడెం, అగ్రహారం, మంటూరు, డి.రావిలంక తదితర పునరావాస కాలనీల్లో ఆలయాలవద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ అన్నసరామాధన నిర్వహించారు.

అడ్డతీగల: మండలంలోని మంగళవారం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. అడ్డతీగల బోడకొండమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహ అన్న సమారాధన నిర్వహించారు. దుర్భర్తి నూకాలమ్మ అమ్మవారికి భక్తులు మొక్కులు తీర్చుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఉగాది సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. స్థానిక రామాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.



మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెంలో శ్రీ లక్ష్మిగణపతి ఆలయంలో ప్రధాన అర్చకుడు పవన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్న తరువాత ఉగాది పచ్చడి పంచారు. ఈకార్యక్రమంలో మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, దంపతులు ఏపీ జెన్కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ దంపతులు , భక్తులు పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న ముత్యాలమ్మవారి ఆలయం

వరరామచంద్రాపురం: శ్రీకోధి నామసంవత్సర ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకోని మండల ప్రజలు తెలుగు సంవత్సరాది సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన వీఆర్పురం, రేఖపల్లి మధ్యలోగల ముత్యాల మ్మవారి ఆలయం, గుణంకొండ గుట్టపై ఉన్న ముత్యాలమ్మ వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునుంచే చిన్న, పెద్ద తేడా లేకుండా భక్తులు ఆలయాల దగ్గర మొక్కులు తీర్చుకునేందుకు అధిక సంఖ్యలో క్యూ కట్టారు. ఈక్రమంలోనే జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ ఆధ్వర్యంలో ఆలయం దగ్గరకు వచ్చిన భక్తులు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసైనికులు బాగుల అంజి, పెట్టా నాగేంద్ర, పి.పవన్కళ్యాన్ ముంజపు సాయి కోట్ల వినయ్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

వై.రామవరం, ఏప్రిల్ 9: శ్రీక్రోధి నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం వై.రామవరంలో ఆంధ్రా వనవాసి కల్యాణ ఆశ్రమం ఆధ్వర్యంలో పలువురికి మజ్జిగ పంపిణీ చేశారు. హిందూ ధర్మ సభ్యులు గొర్లె శివరామకృష్ణ, కోదండ రామాలయ మహిళా కమిటీ సభ్యులు ఈ మజ్జిగను వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సభ్యులు మడకం రామలక్ష్మి, రెడ్డి లక్ష్మి పాల్గొన్నారు.

ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంపచోడవరం అభ్యర్థిగా బంగారు



బంగారు వెంకటేశ్వర్లుకు తిలకం దిద్దుతున్న గిరిజనులు

కూనవరం, ఏప్రిల్ 9: ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థిగా బంగారు వెంకటేశ్వర్లును ప్రకటించారు. ఉగాది సందర్భంగా ముత్యాలమ్మ జాతరలో పూజలు నిర్వహించి పేరు ప్రకటించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మాట్లాడుతూ గిరిజనులు గిరిజన జాతి అభివృద్ధి కోసం వెంకటేశ్వర్లును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కారం కన్నారావు, కనికి రవి, నరేంద్ర, సరోజిని, సావిత్రి, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

కూనవరం, ఏప్రిల్ 9: మండలంలోని మర్రిగూడెం గ్రామంలో ప్రతీ ఏటా ఉగాది రోజున జరిగే ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈజాతరలో గిరిజనులు అత్యధికంగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించింది. భక్తులు పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు రావడంతో జాతర కిటకిటలాడింది.

బొడ్డగండిలో ఈదురుగాలులు



స్థానికుల సహాయంతో చెట్లు తొలగించిన డొంకరాయి పోలీసులు

మోతుగూడెం, ఏప్రిల్ 9: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ పరిధిలోని మొట్టగూడెం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంటకు ఈదురుగాలులకు డొంకరాయి- సీలేరు ప్రధాన రహదారిపై రెండు చెట్లు పడిపోయాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డొంకరాయి పోలీసులు, స్థానిక ప్రజల సహాయంతో రోడ్డుపై నేలకూలిన చెట్లు గొడ్డళ్లతో నరికి చెట్లు తొలగించి రోడ్డుపై అడ్డంకులను తొలగించారు.

కోడిపందాలపై దాడి

కూనవరం, ఏప్రిల్ 9: మండలంలోని గుమ్మయ్యవారిగూడెం గ్రామ శివారున కోడిపందాల స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఉగాది పండుగ సందర్భంగా రహస్యంగా కోడిపందాలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కోడిపుంజులు, రెండు కోడికత్తులు, రూ.1250 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.శ్రీనివాస్ తెలిపారు.

వసంత నవరాత్రులు ప్రారంభం

దివాన్చెరువు, ఏప్రిల్ 9: దివాన్చెరువు ఆగమాశ్రమంలో కోదండరాముని వసంత నవరాత్రులు మంగళవారం ప్రారంభమయ్యాయి. హనుమత్ సమేత కోదండరామస్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మూర్తిహోమం, అష్టోత్తర శతనామపూజ జరిపినట్లు ఆలయార్చకుడు పవనాచార్యులు తెలిపారు. వసంత నవరాత్రులు ఈనెల 16 వరకూ జరుగుతాయని, శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న కోదండరాముని కల్యాణం, పవళింపు సేవ జరుగుతాయని చెప్పారు.

ఉగాది వేడుకలు

- క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు
- పలు ఆలయాల్లో పూజలు.. పంచాంగ శ్రవణం



కడియపులంక హరిహర క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రాజానగరం/కడియం/దివాన్చెరువు/గోకవరం/రంగంపేట/కోరుకొండ/అనపర్తి/రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9: క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలంతా అత్యంత భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వేకువజామునే అభ్యంగన స్నానమాచరించి, నూతన వస్త్రాలు ధరించి ఆలయాలను సందర్శించి దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం షడ్రుచుల సమ్మిళితమైన వేప పువ్వు పచ్చడి(ఉగాది ప్రసాదం) స్వీకరించి, ఆనందంగా గడిపారు. ఇరుగు పొరుగువారికి పంచి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది పచ్చడి వితరణ చేశారు. సాయంత్రం పంచాంగ శ్రవణం జరిపారు. రాజానగరంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరం, రాజలింగేశ్వర స్వామి ఆలయం, రావులచెరువు గట్టున వేంకటేశ్వరస్వామి ఆలయం, సూర్యారావుపేట సమీపంలోని కనకదుర్గ ఆలయాలను భక్తులు సందర్శించారు. అలాగే చక్రద్వారబంధం, తూర్పుగోనగూడెం, పల్లకడియం, వెలుగుబంద, నరేంద్రపురం, పరిజెల్లిపేట, తోకాడ, ముక్కినాడ, నందరాడ గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో చేపట్టిన పంచాంగ శ్రవణంలో ప్రజలు పాల్గొని తమ జాతక ఫలాలను తెలుసుకున్నారు. కడియం ఉన్నత పాఠశాల ఆవరణలో బాధ్యత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు, తులసి దంపతులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఉగాది పచ్చడి వితరణ చేసారు. పంచాంగ శ్రవణం జరిగింది. తమ తండ్రి గిరజాల కృష్ణారావు పేరిట వివిధ రంగాల్లో నిష్ణాతులైన, సమాజానికి సేవలందించిన 12 మందికి విశిష్ట సేవా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో గిరజాల నాగేశ్వరరావు, వెలుగుబంటి అచ్యుతరామ్, తిరుమలశెట్టి శ్రీను, దాసరి శేషగిరి, నందపునీడి గంగా రావు, తోకల శ్రీను, ఆర్ఎస్ఎన్ మూర్తి, సాపిరెడ్డి కామేష్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు. కడియపులంకలోని అనంతేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం జరిగింది. అర్చకులు దేవరబట్ల శ్రీనివాస్శర్మ, నూతలపాటి యశస్వీశర్మ రాశిఫలాలు చదివారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ, నర్సరీ రైతులు పాల్గొన్నారు. రంగంపేట భగవాన్ శ్రీసత్యసాయి సమాజ సేవా కేంద్రంలో శ్రీసత్యసాయి బాలవికాస్ విద్యార్థులు బాబావారి చిత్రపటానికి, దివ్యపాదుకులకు సహస్ర నామార్చన చేశారు. జిల్లా విద్యా విభాగ సమన్వయ కర్త లోలభట్టు శ్రీనివాసరాజు ఉగాది విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సేవాదళ సభ్యులు నేతి సత్యనారాయణ, చిరట్ల రంగమాంబ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉగాది పచ్చడిని స్వీకరించారు. కోరుకొండలోని మరంగంటి రామాలయం వద్ద కపిలవాయి నమఃశివాయ శర్మ, నర్సాపురంలో మర్ల రాజా, జంబుపట్నంలో మర్ల వెంకట గంగాధర సీతారామశాస్త్రి, అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి దేవస్థానం వద్ద రాపర్తి సురేష్శర్మ పంచాంగ శ్రవణం చేశారు. రైతులంతా ఉదయాన్నే రానున్న ఖరీఫ్ వ్యవసాయ పనులు ప్రారంభించారు.



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో పంచాంగ శ్రవణం

అనపర్తిలోని ఉమా రామలింగేశ్వర స్వామి, వీరుళ్ళమ్మ ఆలయ ప్రాంగణాల్లో ఆయన పంచాంగ శ్రవణం చేశారు. వేద పండితుడు రెడ్డి సురేష్శర్మ మాట్లాడుతూ పాలు, పెరుగు, కోడి గుడ్డు ధరలు విపరీతంగా పెరుగుతాయని, గృహ నిర్మాణాలు, వివాహాలు రికార్డు స్థాయిలో జరుగుతాయని, ప్రకృతి వైపరీత్యాలు అధికంగా ఉంటాయిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురు ప్రముఖులు సత్కరించారు. రాజమహేంద్రవరంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పేపర్మిల్లు మెయిన్గేటు ఎదురుగా ఉన్న శ్రీ కృష్ణసాయి కల్యాణ మండపంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిన్నిస్ బుక్లో చోటు సాధించిన రాజమహేంద్రవరం నగరానికి చెందిన యోగా గురువు కేఎస్వీ శ్రీధర్రెడ్డి, కార్తీక్రెడ్డిని సత్కరించారు. రెడ్డి కులానికి చెందిన సుమారు 200 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కర్రి రామారెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి త్రినాథ్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గిన్నిస్ బుక్లో చోటు సాధించిన
యోగా గురువు శ్రీధర్రెడ్డి,కార్తీక్రెడ్డికి సత్కారం

నరసన్న ఆలయంలో ఉగాది ఆస్థానం

కోరుకొండ, ఏప్రిల్ 9: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో క్రోధి నామ సంవత్సర ఉగాది ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామికి పంచామృత అభిషేకం, విశేష అర్చనలు చేశారు. అనంతరం ప్రత్యేక సేవాకాలం, ఉగాది పచ్చడి వితరణ చేశారు. సాయంత్రం ఆలయ ముఖ మండపంలో స్వామికి ఉగాది ఆస్థానం చేపట్టారు. సింహాసనంపై ఉన్న నరసింహస్వామికి గ్రామపురోహితులు కపిలవాయి ఓం నమఃశివాయ ధర్మ పంచాంగ ఫలితాలు వినిపించారు. తదుపరి నరసన్న కల్యాణోత్సవాలు సందర్భంగా కర్రపెత్తనం చేసే నాలుగు రైతు కుటుంబాలకు నూతన వస్త్రాలతోపాటు ఉగాది పురస్కారాలు అందజేశారు. తదుపరి స్వామి వారికి సేవాకాలం, తీర్థగోష్టి జరిగింది. ఉగాది సందర్భంగా నరసింహస్వామిని ప్రత్యేక పల్లకిలో ఉంచి మేళతాళాలు వేద మంత్రోచ్చరణల మధ్య గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో పరాసర రంగరాజ భట్టర్ స్వామి, అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, కటకం సత్యనారాయణ, పెద్దంటి, పెరవళి, పెదపాటి అనువంశక అర్చక స్వాములు రైతు ప్రతినిధులు ఉప్పలపాటి వీరాస్వామి, గరగ శ్రీధర్బాబు,కోడినాగుల వెంకటేశ్వరరావు, మద్దింశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

- కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, ఏప్రిల్ 9: వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని, జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని నరేంద్రపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని వైసీపీ పాలనలో సాగుతున్న దాడులు, దోపిడీలను ప్రజలను వివరించారు. అభివృద్ధి పేరుతో నియోజకవర్గంలో కొండలు, చెరువులను కొల్లగొడుతూ, అక్రమ సంపాదనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం రాజానగరంలో శ్రీనూకాలమ్మ, శ్రీగోగులమ్మ ఆలయాలను సందర్శించి, అనంతరం ఇంటింటికీ ఎన్నికల ప్రచార పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ప్రజలంతా గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాజానగరం, నరేంద్ర పురం గ్రామాలకు చెందిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి చంద్రన్నతోనే సాధ్యం : శిరీష

కడియం, ఏప్రిల్ 9: రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కుమార్తె కంఠంనేని శిరీష అన్నారు. కడియంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెలుగుబంటి ప్రసాద్, మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని అధ్యక్షతన ఆమె ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గోరంట్లను, కమలం గుర్తుపై ఓటేసి ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మజ్జి పద్మ, బీజేపీ నాయకుడు ఆకుల శ్రీధర్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఎంపీటీసీ పుట్టా అనురాధ,అనుసూరి గోవిందు, ముత్తాబత్తుల విజయ, తమ్మిశెట్టి ప్రసాద్, జల్లి కృపారావు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తాం..అభివృద్ధి చూపిస్తాం : వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9: ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వస్తామని..అప్పుడు అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 13వ డివిజన్లో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు దగ్గుబాటి హితేష్ చెంచురామ్తో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఇటీవల ఆదిరెడ్డి వాసు విడుదల చేసిన మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో కప్పల వెలుగుకుమారి, నగరబోయిన రామకృష్ణ, బొర్రా చిన్ని, రాయి అప్పన్నబాబు, మజ్జి రాంబాబు, మస్తాన్ చౌదరి, వాసిరెడ్డి బాబి, సూరంపూడి శ్రీహరి, బైరి సత్యవతి, మల్లెల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఆశయ సాధనకు కృషి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 9: జగన్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమిగా ఏర్పడిన ఎన్డీయే ఆశయ సాధనకు పనిచేస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. పది రోజులుగా నియోజకవర్గంలో జరుగుతన్న రాజకీయ పరిణామాలపై కార్యకర్తలతో చర్చించారు. తదుపరి కార్యాచరణకు వారి అభిప్రాయాలను సేకరించారు. మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు అసెంబ్లీ సీటుపై స్పష్టత వచ్చే వరకు న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. బుధవారం బిక్కవోలు మండలం కొమరిపాలెంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తి సీటును బీజేపీకి కేటాయించడంలో వైసీపీ కీలక పాత్ర పోషించిందని, నేటికీ ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా అనపర్తిలో పోటీలో నిలిచేది తెలుగుదేశం పార్టీ తరపున ఉమ్మడి అభ్యర్థిగా తానేనని అన్నారు. సమావేశంలో ఆళ్ల గోవిందు, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకట రామారెడ్డి, జుత్తుగ కృష్ణ, త్రిమూర్తులు, కొవ్వూరి పార్వతి, సూర్యకుమారి, ఒంటిమి గౌతమి, సర్రి సత్యగౌరి తదితరులు పాల్గొన్నారు.

'రాకా' ఉగాది పురస్కారాలు



పురస్కార గ్రహీతను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9: తెలుగు ఉగాది పురస్కారాలను మంగళవారం రాజమహేంద్రవరం ఎస్పీ బాలు స్మారక సాంస్కృతిక మందిరంలో నిర్వహించారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) పక్షాన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వేదాంతం మురళీకృష్ణమాచార్యులు పంచాంగ శ్రవణం సాగించారు. ప్రముఖ ప్రాచీన కట్టడాల పరిశోధకులు జమ్మి రామారావు, ప్రముఖ కార్టూనిస్ట్ బొబ్బిలి శ్రీనివాసరావు, శాస్త్రీయ సంగీతం మాస్టరు మధుసూదన్లను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రాకా అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, కార్యదర్శి జీవీ రమణ, సరస్వతి జ్ఞాన పీఠం మేనేజర్ ట్రస్టీ తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ రఘురామరాజుకు బాలరాముడి విగ్రహం



కోరుకొండ, ఏప్రిల్ 9: మధురపూడి విమానాశ్రయం వద్ద మంగళవారం ఉదయం నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణ రాజుకు బూరుగుపూడి ఆవభూముల పోరాట నాయకుడు అడపా శ్రీనివాస్ ఉగాది పచ్చడి అందజేశారు. ఈసందర్భంగా ఆయనకు అయోధ్య బాలరాముడి విగ్రహాన్ని బహూకరించారు. కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

అమరనాథ్కు ఎమ్మెల్యే గోరంట్ల పరామర్శ



గారపాటి సర్వారాయుడు (ఫైల్ఫోటో)

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 9: సోదర వియోగంతో బాధపడుతున్న టీడీపీ నాయకుడు గారపాటి అమరనాథ్ను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పరామర్శించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేటకు చెందిన అమరనాథ్ సోదరుడు గారపాటి రాజశేఖర్ సర్వారాయుడు(70) అనారోగ్యంతో మృతి చెందారు. సర్వారాయుడుకు భార్య శిరీష, కుమారుడు డాక్టర్ సురేంద్రనాథ్చౌదరి, కుమార్తె సత్యవతి ఉన్నారు. అమరనాథ్ను పరామర్శించిన వారిలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, ప్రత్తిపాటి రామారావుచౌదరి, మత్యేటి ప్రసాద్, వెలుగుబంటి నాని, పాతూరి సత్యనారాయణ, మర్రెడ్డి రమేష్, పాతూరి రాజేష్ ఉన్నారు.

బీఎంపీల ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా ది ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమాలమ్మ ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన 265 మంది భక్తులకు పరీక్షలు చేసి మందులు అందించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్రాధ్యక్షుడు లంక సత్యనారాయణ, గౌరవ సలహాదారులు ఆకాశం గౌరీష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మా శ్రీనివాస్, ఎస్కే ఇమామ్, డి.గౌరీశంకర రావు, పి.సత్యనారాయణ, డి.రాంబాబు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం పార్లమెంటు

ఎలక్షన్ కోఆర్డినేటర్గా కేశవ



కొవ్వూరు, ఏప్రిల్ 9: రాజమహేంద్రవరం పార్లమెంటు ఎలక్షన్ కోఆర్డినేటర్గా కొవ్వూరుకు చెందిన ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గెల్లా కేశవను నియమిస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానందం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేశవ మంగళవారం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరితో పాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల విజయానికి సహకారం అందజేస్తానన్నారు. ఎన్డీఏ కూటమిని చైతన్యవంతం చేస్తూ బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.

రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద ఎన్నికల చెక్పోస్టు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ జగదీశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 9: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద ఎన్నికల చెక్పోస్టు ఏర్పాటు చేసినట్టు సీఐ వి. జగదీశ్వరరావు తె లిపారు. మంగళవారం స్థానిక టోల్గేటు సెంటర్లోని చెక్పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, గిఫ్టులు రవాణాను అరికట్టడానికి ఈ చెక్పోస్టును ఏర్పాటు చేశామన్నారు. 3 షిఫ్టుల్లో 24 గంటలు సిబ్బంది తనిఖీలు చేపడతారన్నారు. ఒక్కొక్క షిఫ్టుకు ఒక హెడ్కానిస్టేబుల్, నలుగురు సీఐఎస్ఎఫ్ జవాన్లు విధులు నిర్వహిస్తారన్నారు. అలాగే సబ్ డివిజన్ పరిధిలో జగన్నాథపురం, ఘంటావారిగూడెం, పెరవలి, పాలంగి సెంటర్లలో చెక్పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు రూ.50 వేలు మించి నగదు, రూ.10 వేలకు మించిన వస్తువులు సరైన పత్రాలు లేకుండా రవాణా చేయరాదన్నారు.

తనిఖీల్లో రూ.లక్ష పట్టివేత

తాళ్లపూడి, ఏప్రిల్ 9: ఎన్నిక నేపథ్యంలో మండలంలోని వేగేశ్వరపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టుబడింది. మంగళవారం గోపాలపురం మండలం కరగపాడు గ్రామానికి చెందిన కేవీ పోశారావు కుటుంబ సభ్యులు కారులో వెళ్తుండగా వేగేశ్వరపురం వద్ద జరిగిన తనిఖీల్లో రూ.లక్ష గుర్తించామని తెలిపారు. వాటికి ఎటువంటి ఆధారాలు చూపలేకపోయారని అధికారి గురవయ్య తెలిపారు.

ఘనంగా కాళిదుర్గాంబికా జాతర

దివాన్చెరువు. ఏప్రిల్ 9: శ్రీకృష్ణపట్నంలో స్వయంభూ శ్రీకాళిదుర్గాంబికా జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. గరగనృత్యాలు, తీన్మార్తో బాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పందలపాకలో ఇఫ్తార్ విందు

బిక్కవోలు, ఏప్రిల్ 9: పందలపాకలోని అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జీద్లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా మస్జిద్ ఇమాం మౌలానా షేక్ గులామ్ గౌస్ రజ్వీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ విందును ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు పడాల వెంకటరామారెడ్డి, సబ్బారపు సూర్యనారాయణ, కర్రి శ్రీనివాసరావు, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు. అనంతరం రామకృష్ణారెడ్డి ఉగాది సందర్భంగా బలభద్రపురంలోని దుర్గాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

బిక్కవోలు, ఏప్రిల్ 9: బలభద్రపురంలోని పుంతలో ముసలమ్మ ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఘనంగా శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు కల్యాణాన్ని తిలకించి, ముసలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వైసీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

కొవ్వూరు టిక్కెట్టును స్థానికులకే ఇవ్వాలి

కాంగ్రెస్ నాయకుల రెండో రోజు రిలే దీక్ష

కొవ్వూరు, ఏప్రిల్ 9: కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టును స్థానికులకే ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. కొవ్వూరులోని వాటర్ ట్యాంకు వద్ద చేపట్టిన ఈ దీక్షలో పార్టీ మండలాధ్యక్షుడు జొన్నకూటి రవికుమార్ మాట్లాడుతూ రాహుల్గాంధీ ప్రధాని కావాలన్నదే తమ లక్ష్యమన్నారు. అభ్యర్థులను ఎంపిక చేసి ఇన్ని రోజులైనా ప్ర చారం ప్రారంభించలేదన్నారు. కొవ్వూరు రిజర్వు నియోజకవర్గమైనప్పటికీ స్థానికులకు అవకాశం కల్పించకపోవడం బాధాకరమన్నారు. కష్టకాలంలో జెండా మోసిన స్థానిక కార్యకర్తలు అన్యాయమైపోతున్నారని, స్థానికులకు సీటు కేటాయిస్తే ఓటు బ్యాంకు పెంచుతామన్నారు. కార్యక్రమంలో మట్టా సుబ్బారావు, సాకా పుల్లారావు, కొడమంచిలి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాక్షస పాలనను అంతమొందించాలి : మద్దిపాటి

గోపాలపురం, ఏప్రిల్ 9: రాక్షస పాలనను అంతమొందించటానికి దేవతలు సైతం కదం తొక్కాలని కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఉగాది సందర్భంగా రాష్ట్రంలోని కూటమి అభ్యర్థులు గెలుపొందాలని చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గోపాలపురంలోని శ్రీయర్రంపల్లి అమ్మవారి ఆలయంలో మంగళవారం నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని అమ్మవారిని కోరుకున్నట్టు చెప్పారు. పంచాయతీల అభివృద్ధి గాలికి వదిలేశారని, వ్యవస్థలను విధ్వంసం చేసి పోలీసులను అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సీఎం జగన్ 30 రోజుల్లో ఘోరపరాజయం పాలవుతారని అన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	ది ఫ్యామిలీ స్టార్
సూర్యామినీ	గాడ్జిల్లా అండ్ కాంగ్
సూర్యాప్యాలస్	మంజుమ్మల్ బాయ్స్
స్వామి	ది ఫ్యామిలీ స్టార్
శివజ్యోతి	ది ఫ్యామిలీ స్టార్
అనుశ్రీ(సాయికృష్ణ)	మంజుమ్మల్ బాయ్స్
రాజా	ది ఫ్యామిలీ స్టార్
ఊర్వశి	ఓం బీం బుష్
రంభ	గాడ్జిల్లా అండ్ కాంగ్
మేనక	భరతనాట్యం
అప్సర	టిల్లు స్క్వేర్
కుమారి	టిల్లు స్క్వేర్
వీఎస్ మహల్(నామవరం)	ది ఫ్యామిలీ స్టార్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	ది ఫ్యామిలీ స్టార్
వెంకటసూర్య(కడియం)	ది ఫ్యామిలీ స్టార్
సత్యగౌరి (అనపర్తి)	ది ఫ్యామిలీ స్టార్
సూర్యశ్రీ (అనపర్తి)	టిల్లు స్క్వేర్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	టిల్లు స్క్వేర్
రామకృష్ణ(కోరుకొండ)	టిల్లు స్క్వేర్
గీతాసినిమాస్ (సీతానగరం)	ది ఫ్యామిలీ స్టార్
శ్రీనివాస (గోకవరం)	టిల్లు స్క్వేర్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	ది ఫ్యామిలీ స్టార్
లలితామహల్(రంపచోడవరం)	ది ఫ్యామిలీ స్టార్
నవయుగ(చింతూరు)	ది ఫ్యామిలీ స్టార్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

బుధవారం 10 ఏప్రిల్ 2024 | 5







పవన్‌తో రఘురామరాజు భేటీ

పవన్‌కు ఉగాది పచ్చడి తినిపిస్తున్న వర్మ



నిడదవోలు మండలం బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు శేషారావు, పెందుర్తి వెంకటేష్ తదితరులు

ఉభయ గోదావరి జిల్లాల్లో చంద్రబాబు, పవన్ రోడ్ షో

- నేడు తణుకు, నిడదవోలులో ఉమ్మడిగా పర్యటన
- రేపు అంబాజీపేట, అమలాపురంలలో బహిరంగ సభలు
- అమలాపురం పర్యటనకు విడుదల కాని పవన్ షెడ్యూల్

రాజమహేంద్రవరం/ అమలాపురం/నిడదవోలు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం,జనసేన పార్టీల అధినేతలు నారా చంద్ర బాబునాయుడు, పవన్‌కల్యాణ్ రెండు రోజుల పాటు ఉభయగోదావరి జిల్లాల్లో ఉమ్మడిగా రోడ్ షో,బహిరంగ సభలు నిర్వహించనున్నారు.పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో బుధవారం సాయంత్రం 4 గంటలకు రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం చంద్రబాబు, పవన్ రోడ్డు మార్గాన తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మీదుగా నిడదవోలు చేరు కుంటారు. నిడదవోలు గణేష్ చౌక్ సెంటర్‌లో రాత్రి 7 గంటలకు రోడ్ షో నిర్వహిస్తారు. సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు,రాజమహేంద్రవరం లోక్‌సభ కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొంటారు. చంద్రబాబు, పవన్ కలిసి తొలి సారి ఉమ్మడిగా జిల్లాలో పర్యటిస్తున్నారు.దీంతో ఈ పర్యటనకు ప్రాధాన్యత పెరిగింది.కూటమి నాయకులు అందరూ హాజరై సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే శేషారావు, జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.ఈ మేరకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ముగిసిన అనంతరం చంద్రబాబు నిడదవోలులోని తిరుమల సాయి కల్యాణ మండపంలో రాత్రి బసచేస్తారు. పవన్ కల్యాణ్ రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో రాత్రి బసచేస్తారు. 11వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి చంద్రబాబు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా నేతలతో నిడదవోలులో సమీక్ష చేస్తారు. ఎన్నికల సందర్భంగా జిల్లాలో అందరూ కలసి పనిచేయవలసిన అవసరం.. అసం తృప్తులు, కొందరి ఒంటెద్దు పోకడలపై చర్చిస్తారు. ఇప్పటికే జిల్లాలో కొన్ని నియోజక వర్గాల్లో అసంతృప్త నేతలను దారికి తెచ్చారు. నిడదవోలు నియో జకవర్గానికి చెందిన సీనియర్‌నేత కుందుల సత్యనారాయణ, నిడదవోలు పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు గూడపాటి వెంకట్రావు మౌనంగా ఉండడానికి దారి తీసిన పరిస్థితులపై ఆరా తీసే అవకాశం ఉంది. రాజానగరం బీజేపీ ఆత్మీయ సమా వేశంలో అక్కడ టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ ఫొటో బ్యానర్‌లో పెట్టకపోవడంతో సోమవారం కొందరు టీడీపీ వర్గాలు సమావేశాన్ని బహిష్కరించిన విషయం కూడా ఇక్కడ చర్చకొచ్చే అవకాశం ఉంది. అనపర్తి సీటు టీడీపీకే ఖాయం చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ విషయంలో కూడా ఇక్కడ మళ్లీ స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.మధ్యాహ్నం ఒంటి గంటకు భోజన విరామం తీసుకుంటారు.అనంతరం 2 గంటలకు బయలుదేరి చాగల్లు మండలం బ్రాహ్మణగూడెంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 2.25 గంటలకు అంబాజీపేట హైస్కూలు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌లో దిగుతారు.జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పర్యటన ఇంకా షెడ్యూలు విడుదల కాలేదు. ఆయన కూడా ప్రత్యేక హెలికాప్టర్‌లో అంబాజీపేట హైస్కూలు గ్రౌండ్‌లో దిగనున్నారు. చంద్రబాబు హైస్కూలు గ్రౌండ్ నుంచి 3.30 గంటలకు బయలుదేరి 3.45 గంటలకు అంబాజీపేట నాలుగు రోడ్ల జంక్షన్‌కు చేరుకుంటారు. అక్కడ 4 గంటల నుంచి ప్రారంభమయ్యే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ పాల్గొంటారు. గంటన్నర సేపు జరిగే సభ అనంతరం రోడ్డు మార్గాన అమలాపురంలోని గడియార స్తంభం సెంటర్‌కు సాయంత్రం 6.30 గంటలకు చేరుకుంటారు. 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగే బహిరంగ సభలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రసంగిస్తారు. 8.45 గంటలకు సభ ముగిసిన తరువాత చంద్రబాబు కిమ్స్ వైద్యకళాశాల గ్రౌండ్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారని టీడీపీ మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కందుల దుర్గేష్, తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్ పెందుర్తి వెంకటేష్ నిడదవోలు పట్టణంలో హెలిపాడ్ ప్రాంతం, బహిరంగ సభ జరిగే ప్రాంతం, రాత్రి చంద్రబాబునాయుడు బసచేసే ప్రాంతాలను పరిశీలించారు.



కాంగ్రెస్ ప్రచార వాహనాలు ప్రారంభిస్తున్న ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు

కాంగ్రెస్‌లోనే రాష్ట్రాభివృద్ధి

- రాజమండ్రిలో కాంగ్రెస్ కార్యాలయం ఏర్పాటు
- ప్రారంభించిన ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9: రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీయేనని రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరం పాతసోమాలమ్మ ఆలయం రోడ్డులో ఒక భవనంలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పభుత్వంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. మధురపూడి ఎయిర్‌పోర్టుగాని, నన్నయ్య యూనివర్శిటీ, గామన్ బ్రిడ్జి నిర్మాణం, నగరంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు, ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాలను ప్రారంభించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఎస్ఎన్ రాజా, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, అనపర్తి అభ్యర్థి యల్లా శ్రీనివాస్, రాజానగరం అభ్యర్థి ఎం.శ్రీనివాసరావు, కొవ్వూరు అభ్యర్థి అరిగెల అరుణకుమారి, డాక్టర్ వడయార్, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం కాంగ్రెస్ అభ్యర్థిగా చోడదాసి

జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. ఇప్పటి వరకూ గోపాలపురం మినహా మిగిలిన ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అయితే గోపాలపురం నియోజకవర్గానికి మంగళవారం చోడదాసి మార్టిన లూధర్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను బరిలోకి దింపినట్టయింది. అయితే కొవ్వూరు, అనపర్తి అభ్యర్థులను మార్చాలని స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కొవ్వూరు అభ్యర్థిని మార్పు చేసి.. స్థానికులకే టిక్కెట్ ఇవ్వాలని గత రెండు రోజులుగా కొవ్వూరులో నాయకులు నిరాహారదీక్ష చేస్తున్నారు.

పవన్ కేరాఫ్ పిఠాపురం!

- ఇక్కడి నుంచే కూటమి విజయ ప్రస్థానం
- రాబోయే ఎన్నికల్లో కూటమిదే ప్రభుత్వం
- చేబ్రోలులో పవన్ గృహ ప్రవేశం
- నివాసం, జనసేన కార్యాలయం ఇక్కడే
- ఉగాది వేడుకల్లో జనసేనాని.. పచ్చడి తినిపించిన వర్మ
- వేదపండితులకు సత్కారం
- హైదరాబాద్‌కు పయనం



కొత్త ఇంటి వద్ద పవన్‌కు మహిళల హారతి



పంచాంగాలు ఆవిష్కరిస్తున్న పవన్



వర్మ కుటుంబీకుల జ్ఞాపిక

(కాకినాడ,ఆంధ్రజ్యోతి),పిఠాపురం,గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 9 : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పుర్హూతిక అమ్మవారి దయ, శ్రీపాదశ్రీవల్లభుడు, బంగారుపాపమ్మ ఆశీస్సులు, దీవెనలతో పిఠాపురం నుంచే విజయకేతనం ఎగురవేస్తామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అందరి మద్దతుతో కూటమి ప్రభుత్వం ఇక్కడి నుంచే విజయప్రస్థానం సాగిస్తుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. చేబ్రోలులో హైవేను ఆనుకుని ఉన్న ఇంట్లో పవన్ నూతన గృహ ప్రవేశం చేసి మాట్లాడారు. ఈ ఇంటి యజమాని ఓదూరి నాగేశ్వరరరావు దంపతులు, వారి పిల్లలు రెండేళ్ల కిందట మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చారని గుర్తు చేశారు. అప్పుడు వీరంతా తనను పిఠాపురం నుంచి పోటీ చేయాలని కోరారని, కానీ అప్పుడు తాను అంతగా ఆలోచించలేదన్నారు. ఒక నియోజకవర్గం నుంచి తనను పోటీ చేయాలని ఇంత మంది కోరుకుంటారని అనుకోలేదన్నారు. ఆ రోజున పిఠాపురం ప్రజల గొంతుని, ఆకాంక్షని ఆ తల్లి(పుర్హుతికాఅమ్మవారు) ఓదూరి దంపతుల ద్వారా నా దృష్టికి తీసుకువచ్చిందని ఇప్పుడు భావిస్తున్నానన్నారు.శ్రీక్రోధి నామసంవత్సరంలో రాష్ట్రంలో మార్పునకు పిఠాపురం నుంచే శ్రీకారం చుడదామని పిలుపునిచ్చారు.చేబ్రోలులో ఉన్న గృహమే ఇకపై తన నివాసమని, ఇక్కడే జనసేన కార్యాలయం ఉంటుం దని ప్రకటించారు.ఈ ఏడాది అంతా క్షేమంగా ఉండాలని ఆకాం క్షించారు.తన కోసం నియోజకవర్గంలో పనిచేస్తున్న టీడీ పీ,జనసేన,బీజేపీ నాయకులకు అభినందనలు చెప్పారు. కొత్త ఇంటిలో మాజీ ఎమ్మెల్యే వర్మ, ఎంపీ అభ్యర్థి ఉద య శ్రీనివాస్, బీజేపీ నేత కృష్ణంరాజులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఎన్నికలకు సమయం దగ్గరపడడంతో ప్రచారాన్ని పెంచే అంశంపై చర్చించారు.అనంతరం నియోజకవర్గానికి చెందిన జనసేన నేతలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఆ తర్వాత నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు పవన్‌తో భేటీ అయ్యారు.రఘురామ పోటీచేసే స్థా నం ఏంటనే దానిపై ఇరువురు చర్చించుకున్నారు. సమావేశాలు ముగించుకుని మధ్యాహ్న భోజనం అనంతరం మధ్యా హ్నం 3.18 గంటలకు గొల్లప్రోలు హెలిప్యాడ్ నుంచి పవన్ హైదరాబాద్ బయలుదేరారు.కార్యక్రమాల్లో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, ఉపా ధ్యక్షుడు బి.మహేంద రరెడ్డినేతలు వేములపాటి అజయకుమార్,మర్రెడ్డి శ్రీనివాస్, కల్యాణం శివ శ్రీనివాస్,ఎన్.శంకరగౌడ్, యాతం నగేష్,ఏవీ రత్నం, బన్నీ వాసు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలులో పవన్ గృహ ప్రవేశం

పవన్ చేబ్రోలులో తీసుకున్న ఇంట్లో మంగళవారం గృహ ప్రవేశం చేశారు. హైదరాబాదు నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరిన పవన్ మంగళవారం ఉదయం 10.07 గంటలకు గొల్లప్రోలు హెలిప్యాడ్‌కు చేరుకుని రోడ్డు మార్గాన చేబ్రోలు బైపాస్‌రోడ్డులో నివాసానికి చేరుకున్నారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టి తీసి పవన్‌ను ఆహ్వానించారు. గృహప్రవేశం అనంతరం ఇంట్లో పవన్ పూజలు చేశారు. ఇంట్లో మూడు అంతస్తులను తిరిగి చూసి అదే ఆవరణలో ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల్లో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే,టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు,కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్‌లతో కలిసి పాల్గొన్నారు. వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. పవన్‌కల్యాణ్‌కు వేద ఆశీర్వచనాలు పలికి సత్కరించారు. అనంతరం వేదపండితులను పవన్ సత్కరించి పంచాంగాలు అందజేశారు.పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తన సతీమణి లక్ష్మీదేవితో కలిసి ఉగాది పచ్చడిని పవన్‌కు తినిపించారు.అనంతరం వెండి గ్లాసుల సెట్, ఉగాది పచ్చడిని ప్రత్యేక డబ్బాలో ఉంచి వర్మ పవన్‌కు అందించారు.వెంకటేశ్వరస్వామి ఫొటోను అందించారు. బీజేపీ ఇన్‌చార్జి బుర్రా కృష్ణంరాజు దంపతులతో ఫొటో దిగారు. ఉగాది వేడుకలకు కూటమి నాయకులు, వివిధ వర్గాల ప్రజలు భారీగా తరలివచ్చారు.మల్లాం, ఎఫ్‌కేపాలెం మాజీ సర్పంచ్‌లు కుంపట్ల చెల్లారావు, జవ్వాది జోగేశ్వరరావు ధాన్యం కుచ్చులను పవన్‌కు అం దజేశారు.పట్టణానికి చెందిన కవి గౌరినాయు డు తాను రచించిన పుస్తకాలు, అవంత్స సోమసుందర్ రచనలను అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన ఎం.భానుప్రసాద్ చెక్కతో తయారు చేయించిన ఎడ్లబండి,అందులో రైతు, జనసేన జండాలతో కూడిన జ్ఞాపిక తెచ్చారు.



తమ్ముడి వెంట : ఉగాది వేడుకలకు హాజరైన నాగబాబు తదితరులు



తరగని అభిమానం : చేబ్రోలులో పవన్ నివాసం వద్ద అభిమానుల కోలాహలం



పవనాభిమానం : పవన్‌కు జ్ఞాపిక.. పవన్‌తో ఫొటో

గుండెల నిండా పవన్



రాజమండ్రి శ్యామలాంబ



కొవ్వూరు కొవ్వూరమ్మ



నిడదవోలు కోటసత్తెమ్మ



నా మాట విను స్వామి : బిక్కవోలు లక్ష్మీగణపతికి చెవిలో చెప్పేందుకు పోటీపడుతున్న భక్తజనం

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

గుండెపోటుతో సెంట్రల్ జైలు ఖైదీ మృతి

8

దుళ్లలో హోరాహోరీగా ఎడ్ల పట్టు పోటీలు

మురమండ ఎడ్ల జతకు ప్రథమ స్థానం

ఉత్సాహంగా తెలుగు సంవత్సరాది

ఇంటింటా శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ

నిడదవోలు/రాజమహేంద్రవరంకల్చరల్/కొవ్వూరు/బిక్కవోలు, ఏప్రిల్ 9 : తెలుగు సంవత్సరాది ఉగాదిని మంగళవారం ఇంటింటా ఆనందంగా జరుపుకున్నారు..షడ్రుచులు తీపి,పులుపు,వగరు, కారం, ఉప్పు, చేదుతో తయారుచేసిన ఉగాది పచ్చడిని సేవించి ఈ ఏడాది అంతా మంచే జరగాలని వేడుకున్నారు. బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగ సందడి కనిపించింది..ఈ ఏడాది తెలుగువారంతా శ్రీ క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఊరూరా గ్రామదేవతల ఆల యాలు కిటకిటలాడాయి. భక్తులు బంధుమిత్రులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో మంగళవారం ఉగాది పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి విశేషపూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పంచాంగ శ్రవ ణం చేశారు. ప్రత్యేక బంగారు నగల అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాజమహేంద్రవరం శ్యామలానగర్‌లోని పాత సోమాలమ్మ ఆలయంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి సోమాలమ్మను దర్శించుకున్నారు. ఎంపీ భరత్‌రామ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కొవ్వూరు మెయిన్‌రోడ్, గోదావరి గట్టుపై కొలువైన గ్రామదేవత కొవ్వూరమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గరగనృత్యాలు ఏర్పాటుచేశారు. రెల్లిపేటలో కనకదుర్గ, నూకాలమ్మ, పుంతలో ముసలమ్మ, గోష్పాదక్షేత్రంలోని బాలా త్రిపుర సుందరి, సంస్కృత పాఠశాల లలితాపార్వతీ అమ్మవారి ఆలయాలను అలంకరించి విశేష పూజలు చేశారు. బిక్కవోలులోని లక్ష్మీగణపతి దర్శనానికి ఆలయం ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. స్వామి చెవిలో కోర్కెలు చెప్పడానికి భక్తులు పోటీపడ్డారు. గ్రామంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయం కూడ భక్తులతో పోటెత్తింది. స్వామికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కుజ, రజ, సర్ప దోష నివారణార్థం అభిషేకాలు చేయించుకున్నారు.వేకువజాము నుంచి భక్తులు ఆలయాలకు చేరుకుని బారులు తీరి అమ్మవార్లకు మొక్కులు సమర్పించారు. ఉదయం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆలయాలన్నీ మంగళవారం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలన్నీ పువ్వులతో మిరు మిట్లు గొలిపే విధంగా అందంగా అలంకరించా రు.ఎండ వేడిమి కారణంగా అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.చల్లనిమజ్జిగ, మంచినీళ్లను అందించారు.భక్తులకు ఉగాది పచ్చడి,ప్రసాద వితరణ చేశారు.వేద పండితులు శ్రీ క్రోధినామ సంవత్స రంలో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవార్లను ప్రార్థించారు. ఆలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బిక్కవోలు లక్ష్మీగణపతి, సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనాలకు వచ్చిన ఐదు వేల మందికి అన్నదాన ఏర్పాట్లు చేశారు.



పంచాంగకర్త పుల్లెల సత్యనారాయణకు సత్కారం చేస్తున్న పురందేశ్వరి, కాతేరు శ్యామలాంబకు పూజలు



అందరికీ మంచి జరగాలి : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9 : శ్రీ క్రోధి నామ సంవత్సరంలో ప్రజలు అందరికీ మంచి జరగాలి, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, బీజేపీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం పురందేశ్వరి రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రముఖ పంచాంగకర్త పుల్లెల సత్యనారాయణ పంచాంగ శ్రవణం చేశారు. వివిధ రంగాల ప్రముఖులను పురందేశ్వరి సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, బీజేపీ నాయకులు దత్తు, పరిమి రాధాకృష్ణ, రేలంగి శ్రీదేవి, కురగంటి సతీష్, రొంగల గోపి, యానాపు ఏసు, వీరా వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీ ఉమా మార్కండేయేశ్వర స్వామిని పురందేశ్వరి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గంగిన నారాయణరావు ఆధ్వర్యంలో కాతేరు శ్యామలాంబ ఆలయాన్ని దర్శించి అమ్మవారికి పూజలు చేశారు.



నిడదవోలు కోటసత్తెమ్మ ఆలయంలో పంచాంగ శ్రవణం



వేద పండితుడిని సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

ఆరుగురు వేదపండితులకు కలెక్టర్ ఉగాది సత్కారం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 9 : కలెక్టర్ విడిది కార్యాలయంలో మంగళవారం ఉదయం శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది 2024 పురస్కార వేడుకలను పురస్కరించుకుని వేద,ఆగమన పండితులను జిల్లా కలెక్టర్ మాధవీలత సత్కరించారు.వేద, ఆగమన పండితులు అప్పలి నరసింహారావు (విజ్జేశ్వరం), అగ్నిహోత్రం వెంకట సీతారామానుజాచార్యులు (గోపాలపురం), చెరుకూరి భీమశంకరం (రాజమండ్రి), రుద్రపాక శేషగిరిరావు(అన్నదేవర పేట), పొన్నూరి అనంత సత్య వల్లభాచార్యులు (ధవళేశ్వరం), పూజ్యం శంభు ప్రసాద్ (వడిశలేరు)లకు నగదు పురస్కారం, మెమెంటో అందజేసి,శాలువాతో సత్కరించారు.ఈ సం దర్భంగా వేదపండితులు ఆశీర్వనాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా దేవదయ ధర్మదాయ శాఖ అధికారి వి.సోమరాజు,వివిధ ఆలయాల ఈవోలు, ఎండోమెంట్ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయం వద్ద భక్తుల క్యూ

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రాజమహేంద్రవరం పార్లమెంటు
ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా కేశవ



కొవ్వూరు, ఏప్రిల్ 9: రాజమహేంద్రవరం పార్లమెంటు ఎలక్షన్ కోఆర్డినేటర్‌గా కొవ్వూరుకు చెందిన ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గెల్లా కేశవను నియమిస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానందం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేశవ మంగళవారం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరితో పాటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల విజయానికి సహకారం అందజేస్తానన్నారు. ఎన్డీఏ కూటమిని చైతన్యవంతం చేస్తూ బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.

కొవ్వూరు టిక్కెట్టును స్థానికులకే ఇవ్వాలి
రెండో రోజు కాంగ్రెస్ నాయకుల రిలే దీక్ష

కొవ్వూరు, ఏప్రిల్ 9: కొవ్వూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టును స్థానికులకే ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. కొవ్వూరులోని వాటర్ ట్యాంకు వద్ద చేపట్టిన ఈ దీక్షలో పార్టీ మండలాధ్యక్షుడు జొన్నకూటి రవికుమార్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ప్రధాని కావాలన్నదే తమ లక్ష్యమన్నారు. అభ్యర్థులను ఎంపిక చేసి ఇన్ని రోజులైనా ప్రచారం ప్రారంభించలేదన్నారు. కొవ్వూరు రిజర్వు నియోజకవర్గమైనప్పటికీ స్థానికులకు అవకాశం కల్పించక పోవడం బాధాకరమన్నారు. కష్టకాలంలో జెండా మోసిన స్థానిక కార్యకర్తలు అన్యాయమైపోతున్నారని, స్థానికులకు సీటు కేటాయిస్తే ఓటు బ్యాంకు పెంచుతామన్నారు. కార్యక్రమంలో మట్టా సుబ్బారావు, సాకా పుల్లారావు, కొడమంచిలి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద ఎన్నికల చెక్‌పోస్టు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ జగదీశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 9: కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద ఎన్నికల చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్టు సీఐ వి. జగదీశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక టోల్‌గేటు సెంటర్‌లోని చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, గిఫ్టులు రవాణాను అరికట్టడానికి ఈ చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. 3 షిఫ్టుల్లో 24 గంటలు సిబ్బంది తనిఖీలు చేపడతారన్నారు. ఒక్కొక్క షిఫ్టుకు ఒక హెడ్‌కానిస్టేబుల్, నలుగురు సీఐఎస్ఎఫ్ జవాన్లు విధులు నిర్వహిస్తారన్నారు. అలాగే సబ్ డివిజన్ పరిధిలో జగన్నాథపురం, ఘంటావారిగూడెం, పెరవలి, పాలంగి సెంటర్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు రూ.50 వేలు మించి నగదు, రూ.10 వేలకు మించిన వస్తువులు సరైన పత్రాలు లేకుండా రవాణా చేయరాదన్నారు.

నేడు నిడదవోలులో కూటమి బహిరంగ సభ

పెరవలి, ఏప్రిల్ 9: ఈ నెల 10న నిడదవోలులో జరగనున్న టీడీపీ-జనసేన-బీజేపీ బహిరంగ సభకు మండలంలోని మూడు పార్టీల కార్యకర్తలందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయా పార్టీలకు చెందిన నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు అతికాల రామకృష్ణమ్మ, బొడ్డు రామాంజనేయులు, సలాది కృష్ణమూర్తి, జనసేన అధ్యక్షుడు పిప్పర రవి, బీజేపీ నాయకులు సింహాద్రి సత్యనారాయణ, రంగినీడి గంగాధరరావు కార్యకర్తలను కోరారు.

ఘనంగా మోదుగులమ్మ ఉత్సవం



సిరిబొమ్మతో గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాళ్లపూడి, ఏప్రిల్ 9: తాళ్లపూడి గ్రామ దేవత మోదుగులమ్మ ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగ ముందురోజు దేవత స్వరూపంగా భావించే చల్ల ఘటాన్ని గ్రామమంతా ఊరేగిస్తారు. ఉగాది రోజున ఉత్సవం నిర్వహిస్తూ గరగ నృత్యాలు, బాజా భజంత్రీలతో అమ్మవారి ప్రతిరూపమైన సిరిబొమ్మతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయి అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ధనమ్మ తల్లి ఉత్సవం.. వేగేశ్వరపురం గ్రామ దేవత ధనమ్మ తల్లి ఉత్సవాన్ని ఆదివారం ప్రారంభించారు. మంగళవారం సన్నాయిమేళాలు, గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో ఉత్సవం నిర్వహించారు. గ్రామస్థులతోపాటు బల్లిపాడు, పేద్దేవం గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

తనిఖీల్లో రూ.లక్ష పట్టివేత



వేగేశ్వరపురంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

తాళ్లపూడి, ఏప్రిల్ 9: ఎన్నిక నేపథ్యంలో మండలంలోని వేగేశ్వరపురం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టుబడింది. మంగళవారం గోపాలపురం మండలం కరగపాడు గ్రామానికి చెందిన కేవీ పోశారావు కుటుంబ సభ్యులు కారులో వెళ్తుండగా వేగేశ్వరపురం వద్ద జరిగిన తనిఖీల్లో ఆధారాలు లేని రూ.లక్ష గుర్తించామని తెలిపారు. వాటికి ఎటువంటి ఆధారాలు చూపలేకపోయారని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి గురవయ్య తెలిపారు.

కుమ్మరి శాలివాహన కార్పొరేషన్
రాష్ట్ర డైరెక్టర్ పదవికి భద్రయ్య రాజీనామా



పెరవలి, ఏప్రిల్ 9: వైసీపీ నాయకుడు, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు, పెరవలికి చెందిన పసలపూడి భద్రయ్య రాష్ట్ర డైరెక్టర్ పదవికి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. ఈ నెల 10న నిడదవోలులో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరనున్నట్టు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం వల్ల ప్రజలకు ఒరిగిందేమి లేదని, జగన్ బీసీలకు చేసిందేమి లేదని విమర్శించారు.గతంలో తాను టీడీపీలో చాలా కాలం ఉన్నానని, ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందని, అందువల్ల తాను సొంతగూటికి చేరుతున్నట్టు ప్రకటించారు.



'రాకా' ఉగాది పురస్కారాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 9: తెలుగు ఉగాది పురస్కారాలను మంగళవారం రాజమహేంద్రవరం ఎస్పీ బాలు స్మారక సాంస్కృతిక మందిరంలో నిర్వహించారు. రాజమహేంద్రవరం ఆర్ట్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) పక్షాన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వేదాంతం మురళీ కృష్ణమాచార్యులు పంచాంగ శ్రవణం సాగించారు. ప్రముఖ ప్రాచీన కట్టడాల పరిశోధకులు జమ్మి రామారావు, ప్రముఖ కార్టూనిస్ట్ బొబ్బిలి శ్రీనివాసరావు, శాస్త్రీయ సంగీతం మాస్టరు మధుసూదన్లను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రాకా అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, కార్యదర్శి జీవీ రమణ, సరస్వతి జ్ఞాన పీఠం మేనేజర్ ట్రస్టీ తోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వసంత నవరాత్రులు ప్రారంభం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 9: దివాన్‌చెరువు ఆగమాశ్రమంలో కోదండరాముని వసంత నవరాత్రలు మంగళవారం ప్రారంభమయ్యాయి. హనుమత్ సమేత కోదండరామస్వామి ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, మూర్తిహోమం, అష్టోత్తర శతనామపూజ జరిపినట్టు ఆలయార్చకుడు పవనాచార్యులు తెలిపారు. వసంత నవరాత్రులు ఈనెల 16 వరకూ జరుగుతాయని, శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 17న కోదండరాముని కల్యాణం, పవళింపు సేవ జరుగుతాయని చెప్పారు.



కొవ్వూరు: కొవ్వూరమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ముప్పిడి



నల్లజర్లలో పేదలకు వస్త్రదానం చేస్తున్న వాసవీక్లబ్ సభ్యులు



పెరవలి: అన్నవరప్పాడులో వేదపండితుల పంచాంగ శ్రవణం

ఉగాది వేడుకలు

- శ్రీ క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు
- పలు ఆలయాల్లో పూజలు.. పంచాంగ శ్రవణం

కొవ్వూరు/నల్లజర్ల/పెరవలి/తాళ్లపూడి/చాగల్లు/దేవరపల్లి/ఉండ్రాజవరం, ఏప్రిల్ 9: ఉగాది వేడుకలను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాల వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం పంచాంగ శ్రవణం చేపట్టారు. పలువురు భక్తులు ఆలయాలను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కొవ్వూరులోని మెయిన్‌రోడ్, గోదావరి గట్టుపై కొవ్వూరమ్మ ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. గరగ నృత్యాలు ఏర్పాటుచేశారు. రెల్లిపేటలో కనకదుర్గ, నూకాలమ్మ, పంతలో మునలమ్మ, గోష్పాదక్షేత్రంలోని బాలా త్రిపుర సుందరి, సంస్కృత పాఠశాల లలితాపార్వతీ ఆలయాలను అలంకరించి విశేష అర్చనలు, పూజలు చేశారు. కొవ్వూరమ్మ ఆలయంలో కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది ప్రతిఒక్కరి జీవితంలో ఆనందం నింపాలని ఆయన అన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. నల్లజర్ల మండలం పోతవరం, నల్లజర్ల, చీపురుగూడెం, అనంతపల్లి, దూబచర్ల, ప్రకాశరావుపాలెం గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పంచాంగ శ్రవణం జరిపారు. ఈ సందర్భంగా నల్లజర్లలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పేదలకు వస్త్రాదానం చేశారు. టీడీపీ అధ్యక్షుడు నిమ్మలపూడి ప్రసాద్‌ను సత్కరించారు. పెరవలి మండలం అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేద పండితుడు ఫణికుమార్ శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. దేవరపల్లిలో గ్రామ దేవత కడియాలమ్మకు గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుదీరారు. అమ్మవారిని ఎంపీపీ కేవీకే దుర్గారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే శివాలయం, వేంకటేశ్వరస్వామి, కడియాలమ్మ ఆలయాల్లో పంచాంగ శ్రవణం జరిపారు. కార్యక్రమంలో కడియాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు కైరం అప్పారావు, కాట్రు భీమరాజు, దుగ్గిన సూర్యచంద్రం పాల్గొన్నారు. చాగల్లు శివాలయంలో వేదపండితుడు లింగాల శ్రీనివాసశర్మ గ్రామదేవతకు ప్రార్థన చేసి పంచాంగ శ్రవణం చేశారు. అర్చకులు చెరుకూరి శివ సీతారామ్ తదితరులు పాల్గొన్నారు. మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి భక్తులకు పంపిణీ చేశారు. ఉండ్రాజవరం మండలం పాలంగిలో కొండాలమ్మ ఆలయం, దుర్గమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కొండాలమ్మను ఊరేగించారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ఉండ్రాజవరం, సత్యవాడ గ్రామాల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉండ్రాజవరం బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పంచాంగకర్త వీసపాటి పాల శంకర వరప్రసాద్ పంచాంగ శ్రవణం చెశారు. బ్రాహ్మణ సేవాసమితి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వెలగదుర్రులో విశ్వేశ్వర, మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద పంచాంగ శ్రవణం, పండిత సత్కారం నిర్వహించారు.



దేవరపల్లిలో కడియాలమ్మ గ్రామోత్సవం



చాగల్లు శివాలయంలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేదపండితులు

నేడు ఉగాది పురస్కారాలు

చాగల్లు, ఏప్రిల్ 9: మండలంలోని మార్కొండపాడుకు చెందిన పారిశ్రామికవేత్త సుంకవల్లి వెంకన్నచౌదరి, శేషకుమారి దంపతులు ఆధ్వర్యంలో సుంకవల్లి వెంకటరత్నం మెమోరియల్ ట్రస్టు తరుపున సుంకవల్లి ఫౌండేషన్ ద్వారా ప్రతి ఏటా ఉగాది పురస్కారాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలోని ఉత్తమ అధికారులు, రైతులు, విద్యార్థులకు ఈ పురస్కారాలు అందజేస్తారు. బుధవారం మధ్యాహ్నం 3గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) ముఖ్యఅతిథిగా విచ్చేస్తారని, కాటకోటేశ్వరంలోని శ్రీరామ ఆశ్రమం శ్రీరామదాసి ప్రత్యేక ప్రవచనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

రాక్షస పాలనను అంతమొందించాలి
కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, ఏప్రిల్ 9: రాక్షస పాలనను అంతమొందించటానికి దేవతలు సైతం కదం తొక్కాలని కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఉగాది సందర్భంగా రాష్ట్రంలోని కూటమి అభ్యర్థులు గెలుపొందాలని చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని గోపాలపురంలోని శ్రీయర్రంపల్లి అమ్మవారి ఆలయంలో మంగళవారం నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు విజయం సాధించాలని అమ్మవారిని కోరుకున్నట్టు చెప్పారు. వ్యవస్థలను విధ్వంసం చేసి పోలీసులను అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సీఎం జగన్ 30 రోజుల్లో ఘోరపరాజయం పాలవుతారని అన్నారు. పంచాయతీల అభివృద్ధి గాలికి వదిలేశారని, సర్పంచ్‌లకు తెలియకుండా పంచాయతీ ఖాతాల్లో సొమ్ములు లూటీ చేసిన జగన్‌కు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్ అనాలోచిత వైఖరితో పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. వీధిలైట్లు, బ్లీచింగ్, బోర్ల మరమ్మతులు కూడా చేయలేని దుస్థితిలో సర్పంచ్‌లు ఉన్నారన్నారు. చంద్రబాబు సీఎం అయిన వెంటనే పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ, జ్యేష్ఠ శ్రీధర్, కూనపం ప్రసాద్‌బాబు, రోహిత్‌సాయి, ఉండవల్లి దుర్గాప్రసాద్, చినవెంకటేశ్వరరావు, మద్దిపాటి రమేష్ పాల్గొన్నారు.



గోపాలపురంలోని శ్రీయర్రంపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న మద్దిపాటి

జనసేనలో చేరికలు

నిడదవోలు, ఏప్రిల్ 9: జనసేనకు అన్ని వర్గాల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులో న్యాయవాది కంఠంశెట్టి సత్యనారాయణమూర్తి(బుజ్జి), కంఠంశెట్టి గణేష్‌కుమార్, రవీంద్రకుమార్ మంగళవారం జనసేనలో చేరారు. వారికి దుర్గేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు పార్టీకి రూ.లక్ష చెక్కును అందజేశారు. వీరితో పాటు పలువురు మహిళలు, యువత జనసేన సభ్యత్వాన్ని స్వీకరించారు.

దుర్మార్గపు ముఖ్యమంత్రిని ఇంటికి పంపండి: ముప్పిడి

కొవ్వూరు, ఏప్రిల్ 9: దుర్మార్గపు ముఖ్యమంత్రిని బటన్ నొక్కి ఓటు ద్వారా ఇంటికి పంపించాలని ఎన్డీఏ కూటమి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని ఇందిరమ్మకాలనీలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో మంగళవారం టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌ను ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నామని తెలియజేయగా ఆయన తక్షణం మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు శ్రీనివాసరావు, సూర్యదేవర రంజిత్, కిలారి వెంకటలక్ష్మి, జనసేన పట్టణాధ్యక్షుడు డేగల రాము, కె.నవ్య, కొడమంచిలి విజయకుమార్, గంగుమళ్ళ స్వామి పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో టీడీపీ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య ఆధ్వర్యంలో తనయుడు ధరన్‌తో కలిసి ముప్పిడి సతీమణి సుజాత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఉగాది శుభాకాంక్షలు తెలియజేయడంతోపాటు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. విక్రమాదిత్య మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముప్పిడి, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ముళ్లపూడి శ్రీరామచంద్రమూర్తి, కవల రోజారాణి, రామాంజనేయులు, కాకర్ల సత్యేంద్ర, జనసేన నాయకుడు చెవ్వూరి బంగార్రాజు, బీజేపీ నాయకుడు ఎలుగుబంటి బాలకృష్ణ పాల్గొన్నారు.



నిడదవోలులో దుర్గేష్‌కు పార్టీ ఫండ్ అందిస్తున్న కంఠంశెట్టి కుటుంబీకులు



కొవ్వూరులో ముప్పిడికి హారతిస్తున్న మహిళలు

వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

- కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ

రాజానగరం, ఏప్రిల్ 9: వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని, జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్ర ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని జనసేన-టీడీపీ-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని నరేంద్రపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని వైసీపీ పాలనలో సాగుతున్న దాడులు, దోపిడీలను ప్రజలను వివరించారు. అభివృద్ధి పేరుతో నియోజకవర్గంలో కొండలు, చెరువులను కొల్లగొడుతూ, అక్రమ సంపాదనే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. అనంతరం రాజానగరంలో శ్రీనూకాలమ్మ, శ్రీగోగులమ్మ ఆలయాలను సందర్శించి, అనంతరం ఇంటింటికీ ఎన్నికల ప్రచార పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ప్రజలంతా గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో రాజానగరం, నరేంద్ర పురం గ్రామాలకు చెందిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రగతి చంద్రన్నతోనే సాధ్యం: శిరీష

కడియం, ఏప్రిల్ 9: రాష్ట్ర ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి కుమార్తె కంఠంనేని శిరీష అన్నారు. కడియంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెలుగుబంటి ప్రసాద్, మండలాధ్యక్షుడు వెలుగుబంటి నాని అధ్యక్షతన ఆమె ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గోరంట్లను, కమలం గుర్తుపై ఓటేసి ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మజ్జి పద్మ, బీజేపీ నాయకుడు ఆకుల శ్రీధర్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఎంపీటీసీ పుట్టా అనురాధ,అనుసూరి గోవిందు, ముత్తాబత్తుల విజయ, తమ్మిశెట్టి ప్రసాద్, జల్లి కృపారావు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తాం..అభివృద్ధి చూపిస్తాం: వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 9: ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వస్తామని..అప్పుడు అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 13వ డివిజన్‌లో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి తనయుడు దగ్గుబాటి హితేష్ చెంచురామ్‌తో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఇటీవల ఆదిరెడ్డి వాసు విడుదల చేసిన మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో కప్పల వెలుగుకుమారి, నగరబోయిన రామకృష్ణ, బొర్రా చిన్ని, రాయి అప్పన్నబాబు, మజ్జి రాంబాబు, మస్తాన్ చౌదరి, వాసిరెడ్డి బాబి, సూరంపూడి శ్రీహరి, బైరి సత్యవతి, మల్లెల శ్రీను పాల్గొన్నారు.

కూటమి ఆశయ సాధనకు కృషి
టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 9: జగన్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమిగా ఏర్పడిన ఎన్డీయే ఆశయ సాధనకు పనిచేస్తామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తిలోని ఎస్ఎస్ఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. పది రోజులుగా నియోజకవర్గంలో జరుగుతన్న రాజకీయ పరిణామాలపై కార్యకర్తలతో చర్చించారు. తదుపరి కార్యాచరణకు వారి అభిప్రాయాలను సేకరించారు. మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు అసెంబ్లీ సీటుపై స్పష్టత వచ్చే వరకు న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. బుధవారం బిక్కవోలు మండలం కొమరిపాలెంలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అనపర్తి సీటును బీజేపీకి కేటాయించడంలో వైసీపీ కీలక పాత్ర పోషించిందని, నేటికీ ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా అనపర్తిలో పోటీలో నిలిచేది తెలుగుదేశం పార్టీ తరఫున ఉమ్మడి అభ్యర్థిగా తానేనని అన్నారు. సమావేశంలో ఆళ్ల గోవిందు, సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి, జుత్తుగ కృష్ణ, త్రిమూర్తులు, కొవ్వూరి పార్వతి, సూర్యకుమారి, ఒంటిమి గౌతమి, సర్రి సత్యగౌరి తదితరులు పాల్గొన్నారు.

దుళ్లలో ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు
మురమండ ఎడ్ల జతకు ప్రథమ బహుమతి

కడియం, ఏప్రిల్ 9: ఉగాది సందర్భంగా కడియం మండలం మురమండ-దుళ్ల రోడ్డులోని నందీశ్వర ఆలయం వద్ద ఎడ్ల పట్టు ప్రదర్శన పోటీలు మంగళవారం ఉత్కంఠ భరితంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి 16 జతల ఎడ్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. 200 కిలోల బరువుతో 110 గజాల దూరం పట్టు ప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మురమండ గ్రామానికి చెంది మిద్దే సురేష్ ఎడ్లు ప్రథమ స్థానాన్ని, రాజానగరం మండలం చక్రద్వారబంధం గ్రామానికి చెందిన ముంగర నాగేశ్వరరావు ఎడ్లు ద్వితీయ స్థానం, గోకవరం మండలం ముల్లేరు మల్లవరం గ్రామానికి చెందిన మేడిశెట్టి శ్రీను ఎడ్లు తృతీయ స్థానం, మురమండకు చెందిన కురసాల లలితేష్ ఎడ్లు నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు జ్ఞాపికలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతీ జట్టుకు కన్సోలేషన్ బహుమతిగా జ్ఞాపికలు అందించారు. న్యాయనిర్ణేతలుగా మురమండకు చెందిన మొగలపు వెంకటరామకృష్ణారావు, వై.రమేష్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో మొగలపు హరిశ్చంద్రప్రసాద్, వట్టికూటి జానకీరామ్, కొరపాటి చిన్నా, ముత్యాల సత్యనారాయణ ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో ఖైదీ మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ మృతి చెందాడు. జైలు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పి.వెంకటేశ్వరరావు(80) పోక్సో కేసులో 20 ఏళ్ల శిక్షపడి గతేడాది అక్టోబరు 10న విజయవాడ జైలు నుంచి ఇక్కడికి వచ్చాడు. వయసు రీత్యా రుగ్మతల వల్ల ఊపిరితిత్తుల సమస్యలతో బాధ పడుతుండగా పలుమార్లు వైద్యం అందించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడడంతో గత నెల 27 నుంచి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం చేస్తున్నారు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో సోమవారం మృతి చెందాడని జైలు అధికారులు పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వివాహిత అనుమానాస్పద మృతిపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమూరుకు చెందిన ఆశపు నాగజ్యోతి(33)కి నగరంలోని శ్రీరాంనగర్‌కి చెందిన ప్రభుసాగర్‌కి 2016లో వివాహం జరిగింది. జ్యోతి సోమవారం రాత్రి నిద్రించి మంగళవారం ఉదయం మేల్కొలేదని ఆమె తల్లిదండ్రులకు ప్రభుసాగర్ ఫోన్ చేశాడు. దీంతో హుటాహుటిన వచ్చిన తల్లిదండ్రులు కుమార్తె మృతదేహం చూడగా మెడపై కమిలిన చారలు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలం వద్దకు పోలీసులు చేరుకుని ప్రభుసాగర్‌ని ప్రశ్నించారు. సోమవారం ఆమెతో గొడవ జరగడంతో ఉరి వేసుకుందని ప్రభుసాగర్ చెప్పినట్టు తెలుస్తోంది. తన కూతురిని గత కొంతకాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని, ఆ గొడవల నేపథ్యంలో ఆమె హత్యకు గురై ఉంటుందని తండ్రి వెంకటేశ్వరరావు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.ప్రసన్నవీరయ్య గౌడ్ పేర్కొన్నారు.

ఎంపీ రఘురామరాజుకు బాలరాముడి విగ్రహం..



కోరుకొండ, ఏప్రిల్ 9: మధురపూడి విమానాశ్రయం వద్ద మంగళవారం ఉదయం నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుకు బూరుగుపూడి ఆవభూముల పోరాట నాయకుడు అడపా శ్రీనివాస్ ఉగాది పచ్చడి అందజేశారు. ఈసందర్భంగా ఆయనకు అయోధ్య బాలరాముడి విగ్రహాన్ని బహుకరించారు. కార్యక్రమంలో పలువురు జనసైనికులు పాల్గొన్నారు.